12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026
ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :276 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | సోమవారం 12 అక్టోబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :276 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | MON 12 OCTOBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఎం ఆదేశం
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం
- అక్టోబర్ 13 నుంచి జాతీయ స్థాయి సరస్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు
- విజయవాడ ఉత్సవ్ 2.0తో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని సూచన
- రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష



పెన్ పవర్ డెస్క్:విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించా లని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. "ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు.అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'జాతీయ సరస్ మేళా–2026' దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేళాకు, దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో 208 స్టాళ్లు ఏపీకి చెందినవని అధికారులు వివరించారు. మన రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా గొప్ప వేదిక కావాలని సీఎం అన్నారు.
పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0'ను కూడా ఘనంగా నిర్వహించాలని
చంద్రబాబు చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ వరుస కార్యక్రమాల వల్ల భక్తులు, పర్యాటకుల రాకతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఏపీ పంచాయతీరాజ్ దేశంలోనే నెంబర్ 1..

### పవన్ కళ్యాణ్ పాలనపై చిరంజీవి ప్రశంసలు

- కపిలేశ్వరపురం వచ్చిన చిరంజీవి.. కూటమి ప్రభుత్వ పాలనపై వ్యాఖ్యలు
- తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన చిరంజీవి
- ఏపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించిన మెగాస్టార్
- రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య
- పవన్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు దేశంలో మొదటి ర్యాంక్ వచ్చిందని వెల్లడి
- ప్రజలకు ఇలాగే మంచి జరగాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్:మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఆయన కితాబిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం పర్యటన సందర్భంగా ఆయన

- మిగతా 2లో



## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక..

### ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక సూచన

- ఉరవకొండ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబుకు అందించిన మంత్రి పయ్యావుల
- నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో పుస్తకం రూపకల్పన
- అభివృద్ధి పనులపై ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- గత ప్రభుత్వ విధ్వంసం, తమ ప్రభుత్వ వికాసం మధ్య తేడా చెప్పాలన్న చంద్రబాబు

- మిగతా 2లో

## జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు



- ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకే జగన్ కాలయాపన చేస్తున్నారన్న మంత్రి
- ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- వివేకా హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని తీవ్ర విమర్శలు
- అవినీతి సొమ్ముతో పెట్టిన సాక్షి పత్రికతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కేసుల విచారణ వేగవంతం చేసి నిజాలు బయటపెట్టాలని మంత్రి రవీంద్ర డిమాండ్

- మిగతా 2లో

## వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం

- రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పవన్ స్పష్టం
- వైసీపీ మద్దతుదారులు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు కేటాయించామని వెల్లడి
- రూ.2,052 కోట్లతో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి
- గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పార్టీ రంగుల కోసం దుర్వినియోగం చేసిందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:"వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం. మేం అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూస్తున్నాం. ఏ పార్టీ బతకాలనేది కాదు, వ్యవస్థలు బతకాలి, గ్రామాలు బాగుపడాలి, ప్రజల జీవితాలు మెరుగుపడాలి. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత, వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకున్నాను"

- మిగతా 2లో



## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

### ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం

- మిగతా 2లో

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు..

### ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

- బీసీ రిజర్వేషన్లను తగ్గించి వైసీపీ అన్యాయం చేసిందని విమర్శ
- విజయవాడ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా కొనసాగుతోందని వెల్లడి
- స్థానిక ఎన్నికల విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని ధీమా

- మిగతా 2లో





## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

### పాకిస్థాన్‌కు ఇరాన్ వార్నింగ్

- సౌదీ-టర్కీ-పాకిస్థాన్ రక్షణ ఒప్పందంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం
- యెమెన్‌లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక
- పాకిస్థాన్ మధ్యవర్తి పాత్ర కోల్పోయిందన్న ఇరాన్ చట్టసభ సభ్యులు
- సౌదీకి కాగితపు ఒప్పందాలు భద్రత ఇవ్వలేవని ఎద్దేవా
- ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచిన కొత్త సైనిక కూటమి

- మిగతా 2లో

## ప్రభుత్వం భయపడుతోంది..

### అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ

- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోందని సీజేపీ ఆరోపణ
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషమని వ్యాఖ్య
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

పెన్ పవర్ డెస్క్:ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోం దని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా

- మిగతా 2లో






## ఆఫ్రికా తీరంలో పెను విషాదం..

### పడవ ప్రమాదంలో 109 మంది మృతి

**ఆఫ్రికా తీరంలో వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా**
**ప్రమాదంలో 15 మంది చిన్నారులతో సహా 109 మంది మరణం**
**మరో 116 మంది ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు**
**జిబౌటి నుంచి యెమెన్‌కు వెళుతుండగా జరిగిన ఘోర దుర్ఘటన**
**80 మందిని అధికారులు కాపాడగా, సహాయక చర్యలు చేపట్టిన ఐఓఎం**

పెన్ పవర్ డెస్క్:ఆఫ్రికా తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. మెరుగైన భవిష్యత్తు కోసం వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో కలిసిపోయాయి. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న ఒక పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) ఆదివారం ప్రకటించింది.వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 8–9 మధ్య రాత్రి సమయంలో జిబౌటి నుంచి యెమెన్‌కు వలసదారులతో ఈ పడవ బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ పోర్ట్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే సమీపంలోకి రాగానే పడవ

- మిగతా 2లో

## చింత చెట్టు కింద కూర్చుని గిరిజనులతో పవన్ కళ్యాణ్ మమేకం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం గిరిజన గూడెంలో పర్యటించి, అడవి బిడ్డలతో మమేకమయ్యారు. మారుమూల గ్రామానికి స్వయంగా వెళ్లి, చింతచెట్టు

- మిగతా 2లో

## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

### తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్



- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం
- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో 15 కిలోమీటర్ల మేర ఈ మార్గం నిర్మాణం
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం

- మిగతా 2లో




## చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

### తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## ఆఫ్రికా తీరంలో పెను విషాదం..

### పడవ ప్రమాదంలో 109 మంది మృతి

అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. వీరిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు (తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారందరూ ఇథియోపియా జాతీయులని ఐఓఎం తెలిపింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని తమ మైగ్రెంట్ రెస్పాన్స్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. జిబౌటియన్ అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు మరియు సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. పడవ మునిగిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై జిబౌటిలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “ఇది హృదయ విదారకమైన ప్రాణ నష్టం. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలస జీవులు ప్రయాణించే ఈ మార్గంలో ఉన్న ప్రమాదాలకు ఈ ఘటన అద్దం పడుతోంది” అని ఆయన అన్నారు. ఐఓఎం మిస్సింగ్ మైగ్రెంట్స్ ప్రాజెక్ట్ ప్రకారం, 2025లోనే ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం గమనార్హం.

## జగన్ అందుకే తప్పుడు కథనాలు, కార్టూన్లతో తప్పుదోవ పట్టిస్తున్నారు

వాస్తవాలను పక్కదారి పట్టించి, వాటిని రాజకీయంగా వాడుకోవడమే జగన్ రాజకీయ నీతి అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఉన్న ఆర్థిక నేరాల కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ఎదుటివారిపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. తన పత్రికలో తప్పుడు కథనాలు, కార్టూన్లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గుడ్డ కాల్చి ఎదుటివారి మీద వేయడం జగన్‌కు అలవాటుగా మారిందని, దర్యాప్తు సంస్థల విచారణకు రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ సుమారు రూ.48 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై 2011లో కాంగ్రెస్ హయాంలోనే సీబీఐ కేసులు నమోదు చేసిందని మంత్రి గుర్తుచేశారు. “షెల్ కంపెనీలను సృష్టించి, కంపెనీల వాటాల విలువను కృత్రిమంగా పెంచి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఇప్పుడు జగన్ నానా తంటాలు పడుతున్నారు” అని రవీంద్ర వివరించారు.

**వివేకా హత్య నుంచి ఈడీ విచారణ వరకు.. అన్నీ నాటకాలే**

తన బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. “అప్పట్లో చంద్రబాబుపై నిందలు వేస్తూ ‘నారాసుర రక్త చరిత్ర’ అంటూ సాక్షి పత్రికలో కథనాలు రాయించారు. కానీ, ఆయన చెల్లెలు సునీత న్యాయపోరాటంతో నిజాలు వెలుగులోకి వచ్చి, విచారణ తాడేపల్లి ప్యాలెస్ వైపు దారితీయలేదా?” అని జగన్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం ఈడీ విచారణ వేగవంతం అవుతుండటంతో, దానిని అడ్డుకునేందుకు జగన్ 4,000కు పైగా డిశ్చార్జ్ పిటిషన్లు వేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

**అసత్యాల ‘సాక్షి’.. దర్యాప్తు సంస్థలపై దుష్ప్రచారం**

అవినీతి సొమ్ముతో ఏర్పాటైన సాక్షి పత్రిక, పేరుకు మాత్రమే సాక్షి అని, అది అసత్యాలకు నిలువుటద్దంగా మారిందని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఈడీ అనేది కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వానికి దానితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. “విచారణ వేగవంతం అవుతుంటే, దానిపై రాజకీయ కక్ష సాధింపు అని ముద్ర వేస్తూ సాక్షిలో కార్టూన్లు, కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమే” అని అన్నారు.

## చింత చెట్టు కింద కూర్చుని గిరిజనులతో పవన్ కల్యాణ్ మమేకం

కింద రచ్చబండపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విన్నారు. అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతూ, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆదేశాలు జారీ చేసి గిరిపుత్రుల్లో భరోసా నింపారు. పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గిరిశిఖర గ్రామంలో ‘అడవి తల్లి బాట 2.0’ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపే 3.4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 2.29 కోట్లతో శంకుస్థాపన చేశారు. అనంతరం రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఏర్పాటు చేసిన ‘మాటా-మంతి’ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాకోటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ విద్య, వైద్య, మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజల వినతులపై తక్షణమే స్పందించిన పవన్ కల్యాణ్, శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ. 20 లక్షలు, గ్రామ ఆరోగ్య కేంద్రానికి రూ. 15 లక్షలు, హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి వివిధ పథకాల కింద సుమారు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న పవన్ కల్యాణ్‌కు గిరిజన మహిళలు పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వెదురు ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను కలిసి, ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను కూడా పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి నేరుగా తమ గ్రామానికి వచ్చి సమస్యలు తీర్చడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

# వైసీపీ మద్దతుదారులకు ఒకటే చెబుతున్నాం

అని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కాకవాడ గ్రామంలో “అడవితల్లి బాట 2.0” కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తాము బాధ్యతలు స్వీకరించాక వైసీపీ మద్దతు ఉన్న పంచాయతీలకు కూడా నిధులు విడుదల చేశామని, తమకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రూ.2,052 కోట్ల అంచనా వ్యయంతో 2,569 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా 1,341 గిరిజన ఆవాసాలకు 1,976 కిలోమీటర్ల మేర రహదారులు, 45 వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజావసరాలు తీర్చాల్సిన వందల కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయడానికి, వాటిని తొలగించడానికి దుర్వినియోగం చేసిందని తీవ్రంగా విమర్శించారు. అదే నిధులతో ఎన్నో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి ఉండవచ్చన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలోనూ రోడ్లపైకి వచ్చి పోరాడిన జనసైనికులు, వీరమహిళల త్యాగాలను మరువలేమని అన్నారు. వారి త్యాగాలకు గుర్తింపుగా, పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ఉండాలని ఆకాంక్షించారు.

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అని, కొండలను తొలచి, రాక్ కటింగ్ వంటి పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాము నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను స్థానిక ప్రజలే పర్యవేక్షించాలని కోరారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యానవనాల అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, మొబైల్ కనెక్టివిటీ వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. అటవీ అనుమతులు వేగవంతం చేసి సెల్ టవర్లు, రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కోరిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. అధికార అహంకారంతో ప్రజలను భయపెట్టే రోజులు పోయాయని, తప్పును ప్రశ్నించే ధైర్యంతో పాటు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు..

### ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తెలుగుదేశం పార్టీ తరపున 40 శాతం వరకు సీట్లు కేటాయించనున్నట్లు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగానే పార్టీ నాయకుల పనితీరును అంచనా వేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న బీసీల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. రిజర్వేషన్లు అందకుండా అడ్డుకోవడానికి, ఎన్నికలను వాయిదా వేయడానికి వైసీపీ కోర్టు మెట్లెక్కిందని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలు, నిజాయతీ, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మరోవైపు, విజయవాడలో జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు, అభివృద్ధి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవ రాత్రి వేడుకలను విజయవంతం చేయాలని, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ, పర్యాటక శాఖలను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. “అడవి తల్లి బాట” తొలి దశలో 1,976 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా సాగుతోందని చంద్రబాబు అన్నారు. విజయవాడ జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, సంక్రాంతికి నెల్లూరులో మరో 4,000 మందికి పట్టాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, స్థానిక ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. “ఆరోగ్యవంతమైన, సంపన్న, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్” నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## సీఎంకు ఉరవకొండ అభివృద్ధి నివేదిక..

ఆర్థిక మంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని సీఎంకు అందజేశారు. నియోజకవర్గ ప్రోగ్రెస్ కార్డు తరహాలో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. ఉరవకొండకు తాగునీటి సరఫరా, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, నూతన భవనాల మంజూరు వంటి పనుల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు సీఎంకు వివరించారు.

ఈ నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రి పయ్యావులను అభినందించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయడంతో పాటు, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న వికాసానికి మధ్య తేడాను ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. ఇందుకోసం ఎమ్మెల్యేలందరూ ఇలాంటి నివేదికలు, ప్రోగ్రెస్ కార్డులను ప్రజల ముందు ఉంచాలని అభిప్రాయపడ్డారు. తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, లిఫ్ట్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి మంత్రి పయ్యావుల కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వం భయపడుతోంది..

జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, “గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి” అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. “ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు” అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. “తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు” అని రంకా తెలిపారు. తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. “నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు” అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. “ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి” అని ఆయన వ్యాఖ్యానించారు.

## యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు

సౌదీ అరేబియా, టర్కీలతో కలిసి పాకిస్థాన్ ఏర్పాటు చేసిన రక్షణ ఒప్పందం కార్యాచరణలోకి రావడంపై ఇరాన్ తీవ్ర స్వరంతో స్పందించింది. యెమెన్ విషయంలో జోక్యం చేసుకుంటే ప్రాంతంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించింది. ముఖ్యంగా, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ కూటమిలో చేరడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం, సౌదీ మౌలిక సదుపాయాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు పెరగడంతో, ఈ త్రైపాక్షిక ఒప్పందం అక్టోబర్ 5 నుంచి కార్యాచరణ దశలోకి ప్రవేశించింది. సౌదీ అరేబియాకు మద్దతుగా టర్కీ, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో, వేలాది మంది పాకిస్థాన్ సైనికులను సౌదీకి పంపవచ్చనే వార్తలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పందించారు. “మేము కూడా ఈ వార్తను విన్నాం. అది నిజం కాదని ఆశిస్తున్నాం. యెమెన్ విషయంలో ఏ దేశం జోక్యం చేసుకున్నా ప్రాంతంలో అవాంఛనీయ పరిణామాలు తప్పవు” అని ఆయన స్పష్టం చేశారు. అయితే, టర్కీ కంటే పాకిస్థాన్‌పైనే ఇరాన్ తన విమర్శలను ఎక్కువగా కేంద్రీకరించింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా ఇస్లామాబాద్ పోషిస్తున్న ప్రముఖ పాత్రే ఇందుకు కారణం. ఇరాన్ పార్లమెంట్ సభ్యుడు అహ్మద్ నదేరి మాట్లాడుతూ, “యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో సౌదీ పక్షాన పాకిస్థాన్ చేరడం.. ఆ దేశం ఇకపై మధ్యవర్తిగా కాకుండా, ప్రాంతీయ జోక్యదారుగా మారిందని చూపిస్తోంది” అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇరాన్‌లోని పలువురు చట్టసభ సభ్యులు ఈ ఒప్పందాన్ని ఓ కాగితపు ఒప్పందంగా కొట్టిపారేశారు. పార్లమెంట్ జాతీయ భద్రత కమిటీ సభ్యుడు ఇబ్రహీం రెజాయి సౌదీని ఉద్దేశిస్తూ ఘాటుగా విమర్శించారు. “ఏళ్ల తరబడి అమెరికాను ఏకపక్షంగా వాడుకున్నా రాని భద్రత, ఇప్పుడు టర్కీ, పాకిస్థాన్‌లతో చేసుకున్న కాగితపు ఒప్పందం వల్ల వస్తుందా? అనేది సౌదీలు తెలుసుకోవాలి. భద్రత కోసం ఇతరులను వేడుకోవాల్సిన దుస్థితి రాకుండా మీ విధానాలను సరిదిద్దుకోండి” అని ఆయన హితవు పలికారు.

ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ కూటమిని తీవ్రంగా విమర్శిస్తోంది. “యెమెన్ ప్రజలకు వ్యతిరేకంగా సౌదీ యుద్ధంలో టర్కీ, పాకిస్థాన్ చేరాయి” అని తస్నిమ్ న్యూస్ పేర్కొనగా, “ఇది మక్కా కూటమా లేక యెమెన్‌లోని అణగారిన ప్రజలకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమా?” అని నూర్ న్యూస్ ప్రశ్నించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది.

# ఏపీ పంచాయతీరాజ్ దేశంలోనే నెంబర్ 1..

- మొదటి పేజి తరువాయి

స్థానికులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఏపీలో పాలన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలా కాలం తర్వాత రాష్ట్రానికి వచ్చానని, ఇక్కడ పాలన ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నానని చిరంజీవి చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయని ప్రజలు తనకు చెప్పినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తన సోదరుడు పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ పనితీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో దేశవ్యాప్తంగా 23వ ర్యాంకులో ఉన్న పంచాయతీరాజ్ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకోవడం గర్వకారణమని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పరోక్షంగా సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇలాగే మంచి జరగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు చిరంజీవి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్ఎల్ హాస్పిటల్, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్మించిన వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చిరంజీవి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాతే చాలామంది మేల్కొంటున్నారని, లక్షణాలను ముందుగా గుర్తిస్తే సులభంగా కోలుకోవచ్చని సూచించారు. తన భార్య, సోదరి, తల్లికి క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయిస్తానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. నటుడు మురళీమోహన్ ఆరోగ్యాన్ని చూశాక, తాను కూడా మరింత జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించానని చిరంజీవి పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని వివరిస్తూ, తాను హైదరాబాద్ నుంచి గాజు వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటానని చెప్పారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరవడంతో మెగా అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ గన్ని భాస్కర్ రావు, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జీవీబీ చౌదరి, పలువురు మంత్రులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ!

## కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.. ముక్కుపుడక కానుక సమర్పణ







**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11:**

దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మఅమ్మవారికిశ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తిశ్రద్ధలతోపట్టువస్త్రాలు సమర్పించారు.

అమ్మవారిఆశీస్సులురాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రతిఒక్కరూసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనిఆకాంక్షిస్తూప్రత్యేకపూజలునిర్వహించారు.

ఘన స్వాగతం.. వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు!

ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులకు దుర్గగుడి ఈవో, చైర్మన్, ఆలయ బోర్డు సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తితో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఇందులో భాగంగా అమ్మవారికి ముక్కుపుడకను కానుకగా సమర్పించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా!

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. క్యూలైన్లలో ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడి, దర్శనానికి సంబంధించి వారికి అందుతున్నసౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, నిర్వాహకులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలకు భారీగా తరలివస్తున్న భక్తులకు అందిస్తున్న వైద్య సేవలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. భక్తుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవలు అందించాలని సూచించారు.

రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారికి ప్రార్ధన!

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీకాళహస్తి నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రికి విచ్చేసి జగన్మాత శ్రీ కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో ఆనందంగా, అదృష్టంగా ఉందని తెలిపారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని చాటిచెబుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఆలయ ఈవో, బోర్డు సభ్యులు, దేవస్థాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ కేసుల్లో రోజు వారీ విచారణే కాదు..రోజంతా విచారణ జరగాలి

- ♦ **ఈడీ పిటీషన్ వేయడం 100 శాతం కరెక్ట్...ఇది ఎప్పుడో జరగాల్సింది**
- ♦ **ప్రధానులు, ఉపప్రధానులపైన నమోదైన కేసుల్లోనే మూడేళ్లలో విచారణ పూర్తయింది**
- ♦ **భారీ అవినీతి కేసులో నిందితుడైన జగన్ రెడ్డి చట్టం, న్యాయవ్యవస్థ, రాజ్యాంగానికి అతీతుడా**
- ♦ **డిశ్చార్జి పిటీషన్ల పేరుతో ఇంకెంత కాలం విచారణ అడ్డుకుంటారు...వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుంటారు**
- ♦ **సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**నెల్లూరు అక్టోబర్ 11 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

జగన్ రెడ్డి కేసుల్లో రోజు వారీ విచారణ జరపాలని నిన్న తెలంగాణ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది.

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని 43 వేల కోట్లకుపైగా అక్రమాస్తులు కూడగట్టిన జగన్ రెడ్డిపై 2011లో సీబీఐ కేసులు నమోదు చేసింది

15 ఏళ్లు గడుస్తున్నా విచారణ ప్రారంభం కాని ఆ కేసుల్లో రోజువారి విచారణ జరిపేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని ఈడీ కోరింది.

హైకోర్టులో ఈడీ పిటీషన్ దాఖలు చేయడం 100 శాతం కరెక్ట్..ఈ పిటీషన్ ఇప్పుడు కాదు ఎప్పుడో వేయాల్సింది.

దేశానికి ప్రధానమంత్రి, ఉప ప్రధానమంత్రిగా వ్యవహరించిన వ్యక్తులపైన నమోదైన కేసుల్లోనే తీర్పులు త్వరితగతిన వచ్చాయి .

పీవీ నరసింహారావుపై మూడు కేసులు నమోదైతే మూడేళ్లలోనే విచారణ పూర్తయి కోర్టు తీర్పులు వచ్చాయి

జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీల కొనుగోలు ఆరోపణలకు సంబంధించి 1996లో పీవీ నరసింహారావుపై సీబీఐ కేసు దాఖలు చేసింది

కేసు నమోదు, విచారణ, ఛార్జిషీటు దాఖలు, హైకోర్టు విచారణతో పాటు, సుప్రీం కోర్టులో అప్పీలు, తుదితీర్పు 1998లోనే వచ్చేశాయి

వీసీ సింగ్ విదేశీ బ్యాంకుల్లో అక్రమ లావాదేవీలు చేశారని నకిలీ పత్రాలు సృష్టించారనే ఆరోపణల కేసులోనూ పీవీపై రెండేళ్ల వ్యవధిలో తీర్పు వచ్చేసింది.

ఓ కేసులో ఎల్.కే అద్వానీపై కేసు నమోదుకాగానే సంచలన నిర్ణయం తీసుకున్నారు...కోర్టులో కేసు తేలే వరకు పార్లమెంటులో అడుగుపెట్టనని ఎంపీ పదవికి రాజీనామా చేశారు .

రెండేళ్లవ్యవధిలోనే కోర్టులో విచారణ పూర్తిచేసుకుని నిర్దోషిగా బయటకు వచ్చి తిరిగి ఎన్నికల్లో పోటీచేసి లోక్ సభలో అడుగుపెట్టారు.

రూ.43 వేల కోట్ల అక్రమాస్తులకు సంబంధించిన భారీ అవినీతి కేసులో ముద్దాయిగా ఉండి కూడా జగన్ రెడ్డి సీఎం సీటులో కొనసాగారు.

దేశంలోనే ఇది భారీ అవినీతి కేసు...కోర్టులో ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా డిశ్చార్జి పిటీషన్ల పేరుతో అడ్డుకుంటున్నారు

ప్రధాని, ఉప ప్రధానిగా పనిచేసిన వ్యక్తుల కంటే జగన్ రెడ్డి గొప్పోడా..ఈయనేమైనా చట్టానికి, న్యాయస్థానాలకు, రాజ్యాంగానికి అతీతుడని అనుకుంటున్నారా కనీసం కోర్టు వాయిదాలకు కూడాహాజరుకారా....డిశ్చార్జిపిటీషన్లు వేసుకుంటూ ప్యాలెస్ లకు పరిమితమవుతారా రోజువారీ విచారణ జరిపేలా సీబీఐ ప్రత్యేక కోర్టుకు సూచించాలని హైకోర్టును ఈడీ కోరింది...మేం రోజు వారీ విచారణ కాదు...రోజంతా విచారణ జరపాలని కోరుతున్నాం

జగన్ రెడ్డిపై నమోదైన కేసుల్లో వందల మంది సాక్షులున్నారు..వారందరినీ విచారించాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారణ జరగాలి చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమనే సందేశం ప్రజల్లోకి వెళ్లాలి ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో డబ్బున్న వాళ్లు కోర్టుల్లో కేసులను ఎంతకాలమైనా సాగదీస్తారనే భావన ప్రజల్లో వస్తోంది.

హైకోర్టులో ఈడీ పిటీషన్లు దాఖలు చేయడంపై సాక్షి గొంతుచించుకోవడం హాస్యాస్పదం

15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న కేసులను రోజువారీగా విచారణ జరపాలని ఈడీ కోరడం సాక్షికి ఇష్టం లేదంటఈడీ కోరినట్టు రోజువారీ విచారణతో పాటు రోజంతా విచారణ జరిగి త్వరగా తీర్పులురావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.

# రొంపిచర్లలో ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు.





**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 11**

రొంపిచర్ల మండలంలో మాజీమంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకను వైసిపి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి కేక ని కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు పంచిపెట్టారు. అలా అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి కృషి చేసిన నాయకుడు పెద్దిరెడ్డి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో

మాజీ ఎంపీపీలు చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, నాథముని రెడ్డి, రెడ్డీశ్వర్ రెడ్డి, పోకల ఆశోకుమార్, డి.హరినాథరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, కరీముల్లా, విజయశేఖర్, రవీంద్ర, ఉమాపతి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి యశ్వంత్ రెడ్డి , రెడ్డిశేఖర్ రెడ్డి, బావాజీ, సైపూలాఖాన్, ఓబులేసు, మహబుబ్ బాషా, అల్లాబక్స్, తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపేట అర్బన్ సీఐగా తురక వెంకటరమణ అలియాస్ గబ్బర్ సింగ్ బాధ్యతల స్వీకరణ

## నూతన సీఐకి శాలువా కప్పి, పూలమాలతో ఘన స్వాగతం పలికిన ఎస్సై శివశంకరరావు

**నాయుడుపేట,పెన్ పవర్, అక్టోబర్ 11**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయులు ఆదేశాల మేరకు నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా తురక వెంకటరమణ అలియాస్ గబ్బర్ సింగ్ ఆదివారం 7.45 నిమిషాలకు బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నూతన సీఐ వెంకటరమణ అలియాస్ గబ్బర్ సింగ్‌ను అర్బన్ ఎస్సై శివశంకరరావు శాలువాతో సత్కరించి, పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు.





పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఐ వెంకటరమణ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేస్తూ, ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# పెన్ పవర్

## రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# దసరా నవరాత్రి వేడుకల్లో ఆధ్యాత్మిక సందడి!






- **ముత్యాలమ్మ సన్నిధిలో దండి నరేంద్ర ప్రత్యేక పూజలు**
- **పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో కల్యాణ మండపం సేవలు అభినందనీయం**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 11:**

శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన బొమ్మల కొలువు కార్యక్రమంలో జనసేన నాయకుడు దండి నరేంద్ర పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఆలయానికి విచ్చేసిన దండి నరేంద్రకు ఆలయ బోర్డు సభ్యులు పగడాల ప్రతాప్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ రేణుకాదేవితో కలిసి ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

ప్రజల సంక్షేమం కోసం అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు

**ఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ,**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ క్షేమంగా ఉండాలని, రైతులు సుభిక్షంగా జీవించాలని, పశుపక్ష్యాదుల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు తగిన శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు కల్యాణ మండపం ఎంతో ఉపయోగకరంపేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేలా సేవలందిస్తున్న ఆలయ కల్యాణ మండపాన్ని దండి నరేంద్ర అభినందించారు. సామాన్య ప్రజలకు ఆర్థిక భారం తగ్గించే విధంగా ఇలాంటి సదుపాయాలు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

ఈ కల్యాణ మండపం నిర్మాణం సాకారం కావడంలో విశేష కృషి చేసిన మాజీ మంత్రి, దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఈ సందర్భంగా ఆయన మనస్ఫూర్తిగా స్మరించుకున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే సదుపాయాలను కల్పించడం ద్వారా నాయకులు సమాజానికి చిరస్మరణీయమైన సేవలందించవచ్చని పేర్కొన్నారు.

సహకరించిన ఆలయ పెద్దలకు కృతజ్ఞతలు

ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు తనకు అండగా నిలిచి, ఆద్యంతం సహకరించిన ఆలయ బోర్డు సభ్యులు పగడాల ప్రతాప్‌కు దండి నరేంద్ర హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పగడాల సుధాకర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఎంఆర్ఓ చంద్రశేఖర్ రావు, బీసీ సీనియర్ నాయకుడు ఎస్.వి. రమణ, ఆలయ బోర్డు సభ్యుడు శేషు, ఇతర నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తి, సంప్రదాయం, ప్రజాసేవ కలగలిసిన ఈ కార్యక్రమం దసరా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేకతను సంతరించుకుంది.

# నంద్యాల వైసీపీ నేతలకు కీలక పదవులు..

## మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు...





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 11**

నంద్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే సహకారంతో వైసీపీ నాయకులకు కీలక పదవులు లభించాయి.

వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మల్లికార్జున రెడ్డి, వైసీపీ నంద్యాల జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా బిమిరెడ్డి భాస్కర్ రెడ్డి నియమితులయ్యారు.

ఈ సందర్భంగా తమకు పార్టీ పదవులు కల్పించినందుకు సహకరించిన మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డిని నేడు కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకానికి




అనుగుణంగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జి. రాజశేఖర్ రెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, హుసేని, వరప్రసాద్, వెంకీ, బసవ, తరుణ్ కుమార్ రెడ్డి, హుస్సేన్, బాలిస్వరయ్య,కిరణ్, వై. నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు

# దసరా ఉత్సవాల్లో భాగంగా.. వైసిపి రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆలూరు సాంబశివా రెడ్డి

## దంపతులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న..ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.







**నెల్లూరు అక్టోబర్ 11 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా.. వైసిపి రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆలూరు సాంబశివారెడ్డి , మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలూరు సాంబశివా రెడ్డి దంపతులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్..



**ఆళ్లగడ్డ పెన్ పవర్ అక్టోబర్ 11**

ఆళ్ళగడ్డలో తెలుగు దేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆళ్ళగడ్డలోని స్థానిక వైఎస్ఆర్సిపి కార్యలయం నందు ఆళ్ళగడ్డ మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డ్ మాజీ కౌన్సిలర్ శ్రీమతి మునగాల మల్లీశ్వరి, మునగాల సంజీవ కుమార్, గుత్తి రంగయ్య, సాత్రి రాజు, దూదేకుల గిరి బాబు, కూరగాయల శ్రీను, యెల్లాలు మరియు సుధీర్ తో పాటు 100 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదనంగా ఆహ్వానించిన కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు మరియు మాజీ శాసన మండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి

పెన్ పవర్ సోమవారం , 12, అక్టోబర్ ,2026

## ఎంఎం వాడ వినాయక స్వామి ఆలయం వద్ద సూర్యభగవానుడికి విశేష అభిషేకాలు!

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఆధ్యాత్మిక శోభతో పూజా కార్యక్రమాలు!




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11:**
ఆదివారం సందర్భంగా ఎంఎం వాడలోని వినాయక స్వామి ఆలయం సమీపంలో సూర్యభగవానుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యభగవానుడి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు.హిందూ సంప్రదాయంలో ఆదివారానికి విశేష ప్రాధాన్యత ఉండటంతో సూర్యభగవానుడిని భక్తితో ఆరాధిస్తూ అభిషేకాలు, అలంకరణలు నిర్వహించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. సూర్యనారాయణ స్వామి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు.ఈ సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికత, దైవచింతనతో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## కార్యకర్తలకు అండగా జనసేన..

### స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రాతినిధ్యంపై రాజీ లేదు!




**- రేణిగుంటలో జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం.. స్థానిక సమస్యలు, ఎన్నికల వ్యూహాలపై చర్చ**

**రేణిగుంట, పెన్ పవర్, అక్టోబర్ 11:**
జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తామని తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త మిద్దెల హరి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు, జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

రేణిగుంట మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, మండల నాయకుల ఆహ్వానం మేరకు ఆదివారం రేణిగుంటలోని జనసేన పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త మిద్దెల హరి, జనసేన నాయకుడు సత్రవాడ ప్రవీణ్ పాల్గొని, మండలంలోని వివిధ సమస్యలు, పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు.

**స్థానిక ఎన్నికల్లో జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తాం: మిద్దెల హరి**
ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ, జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపు అవకాశాలున్న స్థానాలను పార్లమెంట్ కమిటీ ద్వారా పరిశీలించి, కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి కేటాయించాల్సిన స్థానాలు, పార్టీ ప్రాతినిధ్యం విషయంలో రాజీ పడకుండా, రేణిగుంట మండలానికి సముచిత ప్రాధాన్యత లభించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులు, జనసైనికుల సేవలను గుర్తించి, వారికి తగిన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక దళ సభ్యుడిగా నియమితులైన చిన్నతోటి నాగరాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

**జనసైనికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం: సత్రవాడ ప్రవీణ్**
జనసేన నాయకుడు సత్రవాడ ప్రవీణ్ మాట్లాడుతూ, రేణిగుంట మండలంలో పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలకు ఏ సమస్య ఎదురైనా తమ వంతు సహకారం అందించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకుంటూ, ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

సీనియర్ నాయకుల అనుభవాలను, యువత ఉత్సాహాన్ని సమన్వయం చేసుకుంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

**నాయకుల మధ్య సమన్వయమే పార్టీ బలోపేతానికి కీలకం**
ఈ సమావేశంలో రేణిగుంట మండలంలోని స్థానిక సమస్యలపై చర్చించడంతోపాటు, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ, ప్రజలతో నిరంతర సంబంధాలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక దళ సభ్యుడు చిన్నతోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, ఐటీ కోఆర్డినేటర్ దీన్ దయాల్, సీనియర్ నాయకులు త్యాగరాజు, మాజీ వార్డు సభ్యుడు మహబూబ్ భాషా, ఎస్ఎంసీ గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ కరీముల్లా, కోఆర్డినేటర్ అనురాధ, జనసేన నాయకులు పార్థసారథి, ముఖేష్, రమేష్, మునికృష్ణ, సలీం, తిలక్, ఆర్. సతీష్, వెంకటేష్, బసవ పున్నయ్య, నరేష్ కుమార్, ఎస్. రమేష్, మహేష్‌తో పాటు పలువురు వీర మహిళలు, జనసైనికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల ఐక్యత, నాయకుల సమన్వయం, కార్యకర్తలకు అండగా నిలవడం వంటి అంశాలతో రేణిగుంటలో నిర్వహించిన ఈ సమావేశం పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చకు వేదికగా నిలిచింది.

## పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

### పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ కు కనీస వేతనం అమలు చేయకపోతే ఉద్యమం తప్పదు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 11**
నంద్యాల సిపిఐ కార్యాలయంలో జరిగిన పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియం సమావేశంలో కాంట్రాక్టర్ను,అధికారులను హెచ్చరించినఏఐటీయూసీ నంద్యాల సిటీ అధ్యక్ష,కార్యదర్శులు డి. శ్రీనివాసులు,ధనుంజయ్‌పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు కనీస వేతనం 16500 ఇవ్వాలని,పని భారం ఒత్తిడి తగ్గించాలని,పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ ను తీసివేయకుండా ఎవరి స్థానంలో వారినే కొనసాగించాలని,జీతాలు ఐదు నుండి పదో తేదీ లోపు ఇవ్వాలని,పబ్లిక్ టాయిలెట్స్ క్లీన్ చేయడానికి కావాల్సిన సామాగ్రిని అందజేయాలని, గత రెండు నెలల నుండి పెండింగ్ లో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ జీతాలను తక్షణమే చెల్లించాలని ఈరోజు స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగినటువంటి పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు



డి శ్రీనివాసులు ధనుంజయ్, పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ సుబ్బమ్మ,రాధ లు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ లక్ష్మి దేవి, కాశమ్మ,సరోజమ్మ, లక్ష్మదేవి, వెంకటమ్మ,సునీత, భరత్, పెంచలమ్మా,నాగమద్దమ్మ పెంచలమ్మా,నరసమ్మ,దేవి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు దివ్యాంగులకు

### ఇచ్చిన (ఇంద్రధనస్సు) హామీలను తక్షణమే అమలు చేయాలి




**నెల్లూరు అక్టోబర్ 11 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
ఇంద్రధనస్సులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు కల్పిస్థానన్న రాజకీయ రిజర్వేషన్ బూటకమేనా చంద్రబాబు సమాధానం చెప్పాలి. YSRCP దివ్యాంగుల విభాగంరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర డిమాండ్. ఇంద్రధనస్సు పేరుతో దివ్యాంగులను మోసం చేసిన చంద్రబాబు నాయుడు .
దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ను పూర్తి స్థాయిలో వెంటనే అమలు చేయాలని డిమాండ్. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల జీవితాలను ఛిద్రం చేసిన చంద్రబాబు ప్రభుత్వం.

## రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధం..

### కనకదుర్గమ్మకు శ్రీకాళహస్తి దేవస్థానం పట్టు వస్త్రాల సమర్పణ!





**- చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో పసుపుకుంకుమ సమర్పణ.. భక్తిశ్రద్ధలతో దసరా నవరాత్రుల సేవ**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11:**
విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం తరఫునఅమ్మవారికిపట్టువస్త్రాలు, పసుపుకుంకుమలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమం భక్తిభావాన్ని, సనాతన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం నిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు, ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొని కనకదుర్గమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా పట్టు వస్త్రాల సమర్పణ**
హిందూ సంప్రదాయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపుకుంకుమలను సమర్పించడం విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆచారం. ముఖ్యంగా దసరా శరన్నవరాత్రుల సమయంలో జగన్మాతను వివిధ రూపాల్లో పూజిస్తూ, లోకకల్యాణం కోసం ప్రార్థించడం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున కనకదుర్గమ్మ అమ్మవారికి వస్త్ర సమర్పణ చేయడం నవరాత్రి ఉత్సవాలకు మరింత ఆధ్యాత్మిక శోభను చేకూర్చింది.

**రెండు పుణ్యక్షేత్రాలు.. ఒకే భక్తిభావం!**
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం, విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి క్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లో విశిష్ట ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.
ఈ రెండు పుణ్యక్షేత్రాల మధ్య భక్తి, సంప్రదాయం, దైవారాధనకుసంబంధించినఅనుబంధాన్నిచాటిచెప్పేలా ఈ వస్త్ర సమర్పణ కార్యక్రమం సాగింది.
దేవస్థానాల మధ్య ఆధ్యాత్మిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భక్తులలో ధార్మిక చింతనను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సనాతనసంప్రదాయాలపరిరక్షణకు దోహదపడతాయని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన**
దసరా శరన్నవరాత్రుల పవిత్ర వేళ జగన్మాత శ్రీ కనకదుర్గమ్మఅమ్మవారికృపాకటాక్షాలురాష్ట్రప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## యం.డి. పుత్తూరులో వైభవంగా శ్రీ మహంకాళీదేవి యల్లమ్మతల్లి నవరాత్రి మహోత్సవాలు!

### రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం!

**ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 11:**
తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం యం.డి. పుత్తూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మహంకాళీదేవి యల్లమ్మతల్లి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి నవరాత్రి వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతుండటంతో ఆలయ పరిసరాలు భక్తిభావంతో కళకళలాడుతున్నాయి.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని ఒక్కో విశిష్ట అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి అలంకరణలో అమ్మవారి దివ్యరూపం భక్తులకు కనువిందు చేయడంతో పాటు, అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభిస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

**అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలి!**
నవరాత్రి మహోత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.
లోకకల్యాణం, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు సిద్ధించాలని శ్రీ మహంకాళీదేవి యల్లమ్మతల్లిని భక్తులు ప్రార్థిస్తున్నారు.



## బాలికల విద్యే సమాజ ప్రగతికి పునాది!

**- బాల్యవివాహాలను అరికట్టి.. బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి!**
**- ఏర్పేడు మండలం చిందేపల్లి గిరిజన కాలనీలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం**

**ఏర్పేడు ,పెన్ పవర్ ,అక్టోబర్ 11:**
బాలికల హక్కుల పరిరక్షణ, విద్య ప్రాధాన్యత, బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏర్పేడు మండలం చిందేపల్లి గిరిజన కాలనీలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, క్రై సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలికలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొని బాలికల అభ్యున్నతికి తమ మద్దతు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి కోఆర్డినేటర్ శిరీష
ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ.. నేటి బాలికలే రేపటి సమాజానికి మార్గదర్శకులని, బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రతిభను చాటగలరని పేర్కొన్నారు. బాలికలు విద్యను కొనసాగిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.
గ్రామీణ ప్రాంతాల్లో కొందరు తల్లిదండ్రులు బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపించడం ఆందోళనకరమని అన్నారు. బాల్యవివాహాల కారణంగా బాలికలు విద్యకు దూరమవడంతో పాటు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని, వారి భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని వివరించారు. బాల్యవివాహాలు మాతా శిశు ఆరోగ్యంపై తీవ్ర




ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ కుమార్తెల చదువుకు ప్రాధాన్యతనిస్తూ, వారి ఆశయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.
బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత చంద్రశేఖర్
ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిరోధక చట్టం, 2006, బాల కార్మికుల నిషేధం మరియు నియంత్రణ చట్టం, 1986, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో), 2012 వంటి చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని సూచించారు.
బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడటం, లైంగిక దాడులకు ప్రయత్నించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలికల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.
బాల్యవివాహం అనేది కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. అది సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో బాల్యవివాహాలను అరికట్టాలని సూచించారు.
బాలికలు చదువును మధ్యలో ఆపకుండా ఉన్నత విద్యనుఅభ్యసించేలాప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.
బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ.. మానవహారం
కార్యక్రమంలో భాగంగా బాలికల విద్య, సంరక్షణ, భద్రత, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.
అనంతరం బాలికల చదువును ప్రోత్సహిద్దాం.. బాల్యవివాహాలను వ్యతిరేకిద్దాం.. బాలికల హక్కులను కాపాడుదాం అంటూ నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సందేశమిస్తూ మానవహారం ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో-కన్వీనర్లు రామచంద్ర, వెంకటేష్, సంస్థ సిబ్బంది, అంగన్వాడీ టీచర్ వెంకటమ్మ, ఆశా కార్యకర్త సుజాత, ఈసీ సభ్యులు, సీపీవోఎస్ సభ్యులు, కిషోర బాలికలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.
బాలికకు విద్యనందించడం అంటే ఒక వ్యక్తి జీవితాన్నే కాదు.. ఒక కుటుంబ భవిష్యత్తును, సమాజ అభివృద్ధిని తీర్చిదిద్దడమే. బాల్యవివాహాలను అరికట్టి, ప్రతి బాలికకు విద్యా హక్కు, రక్షణ, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధ్యమవుతుంది.

## ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన దుత్తలూరు నూతన ఎస్సై మహేంద్ర గారు..!

పెన్ పవర్ జిల్లా బ్యూరో అక్టోబర్ 11
దుత్తలూరు మండలం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మహేంద్ర గారు గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు ఎస్సై మహేంద్ర గారితో ఆప్యాయంగా మాట్లాడి, నూతన బాధ్యతల స్వీకరణ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.
శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీసు సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ దుత్తలూరు మండలంలో శాంతిభద్రతలను పటిష్టంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.



# ఆడపిల్లలను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారిడాక్టర్ శారదా బాయి.





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 11**

అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా ఈరోజు వైద్య సిబ్బంది, ఆర్ ఆర్ నర్సింగ్ విద్యార్థులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి సమావేశం ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించడం జరిగింది

ఈ సందర్భంగా డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ ఆడపిల్లలను బ్రతకనిద్దాం ఎదగనిద్దాం చదవనిద్దాం బాలికల హక్కులలో పెట్టుబడులు పెడదాం

మగ బిడ్డ ఆడ బిడ్డని తేడా లేకుండా ప్రజలను చైతన్య పరిచే బాధ్యత వైద్య సిబ్బంది మీద ఉంది అన్నారు బాలికలకు వారి హక్కుల గురించి వారి చట్టాల గురించి ఆరోగ్య విద్య అందించాలన్నారు

ఆడబిడ్డ సమాజానికి ఎంతో అవసరమని అటువంటి ఆడబిడ్డను సమానంగా తల్లిదండ్రులు చూడాలని ఉన్నత చదువులు చదివించాలని కోరారు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విద్యార్థులకు ఆడపిల్లను బతకనిద్దాం అనే నినాదం మీద ఫిలిం షో కాంపిటీషన్ నిర్వహించడం జరిగిందని మొదటి బహుమతి ద్వితీయ బహుమతి తృతీయ బహుమతి విద్యార్థుల టీములకు రేపు పిజిఆర్ఎస్ భవనంలో జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ రాజకుమారి గనియ గారి చేతుల మీదుగా బహుమతులు విద్యార్థులకు అందజేస్తారని డిఎంహె ఓ డాక్టర్ శారదా బాయి ,తెలిపారు

ఆడబిడ్డలకు చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల కుటుంబాన్ని అర్థం చేసుకోలేక కాన్పు సమయంలో కష్టాలు పడుతూ సంసార బాధ్యతలు తెలియకపోవడంఆమెనిర్ణయంయంతీసుకోలేకపోవడం వల్లకొన్నిఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుందని వాటిని పెంపొందించవలసిన బాధ్యత ప్రతి పౌరుని మీద ఉందని తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు ఆడపిల్ల లేదా మగ బిడ్డ అని స్కానింగ్ సెంటర్ లోకి వెళ్లి అడగకూడద నీ, అడిగినటువంటి వారికి లింగ నిర్ధారణ చెప్పిన వైద్యులకు పిసిపి ఎన్డిటి 1994 చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ లలిత. సూపరిండెంట్ డాక్టర్ చిట్టిబాబు

ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జగదీశ్ చంద్రారెడ్డి డాక్టర్ కాంతారావు నాయక్ డెమో మల్లేపల్లి పామన్న వైద్యులు ఆర్ఆర్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# పిడతల సుధాకర్ కు నంద్యాల అసెంబ్లి సమన్వకర్తగా నియమిస్తూ జనసేన పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ






నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 11

నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో పిడతల సుధాకర్ కు పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తూ నంద్యాల అసెంబ్లీ సమన్వకర్తగా నియమిస్తూ జనసేన పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది జనసేన పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన పిడతల సుధాకర్ అభిమాన సంఘం పవన్ కళ్యాణ్ వీరాభిమానిగా ఉంటూ జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి జెండా మోసి నంద్యాల నియోజకవర్గంలో తనదైన శైలిలో గుర్తింపు పొంది జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిస్వార్థంగా చేస్తూ పార్టీ క్యాడర్ ను ఉత్తేజపరుస్తూ అందరినీ కలుపుకుపోతు పార్టీ బలోపేతానికి కృషి చేసిన సౌమ్యుడు ఎలాంటి మచ్చలేని జనసేన సైనికుడిగా పేరు తెచ్చుకున్న పిడతల సుధాకర్ ను నంద్యాల అసెంబ్లీకి సమన్వకర్త పదవికి అర్హుడుగా ప్రకటిస్తూ జనసేన పార్టీ అధిష్టానం కార్యకర్తల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. పిడతల సుధాకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ తనపై నమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వాహిస్తామని జనసేన పార్టీ కోసం అధినేత పవన్ కళ్యాణ్ కోసం పదవులు లేకున్నా కష్టపడి పని చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అందరిని కలుపుకొనిపోతూ పార్టీని బలోపేతం చేస్తామని నంద్యాల నుంచి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు బహుమతిగా ఇక్కడి నుండి అభ్యర్థులను గెలిపించుకొని తమ అధినేతకు అందజేస్తామని వారన్నారు

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ..
# ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**ఆళ్లగడ్డ పెన్ పవర్ అక్టోబర్ 11**

ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు.. సమస్యల పరిష్కారానికి హామీ....

ఆళ్లగడ్డ పట్టణంలో ముస్లిం మైనారిటీ సోదరుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గతంలో ఆళ్లగడ్డ పట్టణంలోని మసీదు సమీపంలో ఉన్న ఈద్గా, ఖబరస్తాన్‌ను సందర్శించిన సమయంలో సమాధుల వద్ద మట్టి కుంగిపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సమస్యను పరిష్కరిస్తానని అప్పట్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తన సొంత నిధులతో మట్టి తోలించి అవసరమైన పనులు పూర్తి చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి కావడంతో ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

అదేవిధంగా మసీదు కాంపౌండ్ వాల్ నిర్మాణం, అంతర్గత రహదారి ఏర్పాటు వంటి సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఇమామ్‌లకు అనుకూలమైన స్థలంలో నివాస కాలనీ ఏర్పాటు





చేయాలన్న విజ్ఞప్తిపై ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

ఆళ్లగడ్డ పట్టణం, మండల పరిధిలోని మసీదులకు అవసరమైన కాంపౌండ్ వాల్స్ నిర్మాణం కోసం సుమారు రూ.2 కోట్ల నిధుల మంజూరుకు సంబంధించి సమాచారం అందిందని, దీనిపై మరోసారి అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ నిధులతో పట్టణంలో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సహకారంతో ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని, జిల్లా స్థాయిలోనే అభివృద్ధిలో ఆళ్లగడ్డ ను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు

# నెల్లూరుని దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం - మంత్రి నారాయణ

- **237 కోట్లతో నగర నయా లుక్.. శరవేగంగా అభివృద్ధి పనులు**
- **గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి నారాయణ ధ్వజం**
- **2027 జూన్ 12 నాటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి**

**నెల్లూరు అక్టోబర్ 11 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి నారాయణ.. పాఠశాలల ఆధునీకరణ, రోడ్ల నిర్మాణం, తాగునీటి ప్రాజెక్టులపై కీలక ప్రకటనలు చేశారు. 2027 జూన్ నాటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేసి, నెల్లూరును దోమలు లేని నగరంగా మారుస్తామని స్పష్టం చేశారు...15వ డివిజన్ పరిధిలోని సర్వేపల్లి కాలువ కట్టపై 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం 51వ డివిజన్ సుబేదారుపేటలో ఆధునిక హంగులతో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. బాజీ తోటలోని ప్రైమరీ స్కూల్‌ను స్వయంగా పరిశీలించిన మంత్రి, విద్యార్థుల సౌకర్యార్థం అదనపు భవనాలను తక్షణమే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటన సందర్భంగా స్థానికులు, కూటమి నాయకులు ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం





పలికారు..ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. 'నాడు-నేడు' పేరుతో అరకొర పనులు చేసి వదిలేశారని మండిపడ్డారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. తొలివిడతలో 23 స్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశంలోనే నెల్లూరు నగరాన్ని ఒక రోల్ మోడల్‌గా నిలుపుతామన్నారు.

పాఠశాలల ఆధునీకరణకు సహకరిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నగరంలో రోడ్ల మరమ్మతులు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న మంత్రి.. హ్యామ్ ప్రాజెక్ట్ కింద నెల్లూరు అభివృద్ధికి ముఖ్యమంత్రి 237 కోట్ల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో రోడ్లు, పార్కులు, సెంట్రల్ డివైడర్లు, ఐలాండ్ల అభివృద్ధి పనులతో పాటు బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యూజీడీ, తాగునీటి సరఫరా, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. 2027 జూన్ 12 నాటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తిగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరును దోమలు లేని నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ అందిస్తామని హామీ ఇచ్చారు..

ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత,డిఈఓ బాలాజీ రావు,ఈఓ తిరుపాల్,ఎస్ఈ జానీ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,నగరపార్టీ అధ్యక్షులు మామిడాల మధు,రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు,డివిజన్ టీడీపీ నాయకులు పెంచల్ చౌదరి,అంచూరి శ్రీనివాసులు నాయుడు,కమతం ప్రశాంత్ కుమార్,క్లస్టర్ జోసెఫ్,స్థానిక జనసేన నేత సనత్,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం..
# సీట్లు కేటాయింపులో సముచిత న్యాయం!

- **కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో బీసీలకు 32.78 శాతం రిజర్వేషన్లు**
- **తిరుపతి జిల్లాలో 66 డివిజన్లు, బీసీలకు 22 కార్పొరేటర్ స్థానాలు!**

**శ్రీకాళహస్తి ,పెన్ పవర్, అక్టోబర్ 11:**

స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బీసీలకు 32.78 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం లభించనుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ రిజర్వేషన్లను నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఈ రిజర్వేషన్ల ప్రకారం తిరుపతి జిల్లాలోని స్థానిక సంస్థల్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, బీసీలకు 22 కార్పొరేటర్ స్థానాలు కేటాయించారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.

రిజర్వేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి:

శ్రీకాళహస్తి: 44 సీట్లలో బీసీలకు 14 సీట్లు.

పుత్తూరు: 36 సీట్లలో బీసీలకు 12 సీట్లు.

సూళ్లూరుపేట: 32 సీట్లలో బీసీలకు 11 సీట్లు.

నాయుడుపేట: 32 సీట్లలో బీసీలకు 11 సీట్లు.

వెంకటగిరి: 36 సీట్లలో బీసీలకు 12 కౌన్సిలర్ స్థానాలు.




బీసీల రాజకీయ ఎదుగుదలకు రిజర్వేషన్లు దోహదం చేస్తాయా? స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా వర్గాల్లో రాజకీయ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజా సమస్యలపై అవగాహన కలిగి, ప్రజలతో మమేకమై పనిచేసే బీసీ నాయకులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించనుంది. అయితే, ఈ అవకాశాలను ఆయా రాజకీయ పార్టీలు ఏ విధంగా వినియోగించుకుంటాయి? బీసీ నాయకులకు అభ్యర్థుల ఎంపికలో ఎంతవరకు ప్రాధాన్యం ఇస్తాయి? అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా, రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపికలోనూ తగిన ప్రాధాన్యం కల్పిస్తేనే ఈ నిర్ణయం ఆశించిన ఫలితాలను అందిస్తుందని బీసీ వర్గాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీకాళహస్తిలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం!
## తొలిరోజు కనకాచల కొండపై కొలువుదీరిన దుర్గమ్మ దర్శనానికి భక్తుల ఆసక్తి





శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో విజయదశమి ఉత్సవాలు, దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం నుంచి ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీకాళహస్తి పట్టణంలోని కనకాచలం కొండపై వెలసిన శ్రీ కనకాచల కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

శరన్నవరాత్రుల తొలిరోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తున్నారు.

దసరా శరన్నవరాత్రులు భక్తులకు ఎంతో విశిష్టమైనవి. తొమ్మిది రోజులపాటుఅమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శించుకోవడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి.

# స్థానిక సమరానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధం!

- **స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా జిల్లా స్థాయి సమీక్షా సమావేశం**
- **పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు**

**తిరుపతి, పెన్ పవర్,అక్టోబర్ 11:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నద్ధతపై దృష్టి సారించింది. తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లోకి పార్టీ విధానాలను తీసుకెళ్లాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

**అన్ని స్థానాల్లో పోటీకి కాంగ్రెస్ సిద్ధం: బాలగురవం బాబు**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేసే పార్టీ అని పేర్కొన్నారు. ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

**ప్రజల హక్కులు, సంక్షేమం కోసం కాంగ్రెస్ పోరాటం: తలపా దామోదరం రెడ్డి**

తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారనే విశ్వాసం ఉందన్నారు. దేశ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించగలదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వివిధ వ్యవస్థల్లో నిర్బంధ ధోరణులు కొనసాగుతున్నాయని విమర్శించారు.

పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందాలంటే ప్రజా



సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే పాలన అవసరమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

**ఎన్నికలే లక్ష్యంగా పార్టీ శ్రేణుల సమన్వయం**

జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, విధానాల ప్రచారం, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు మాంగాటి గోపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఓబీసీ కర్ణాటక రాష్ట్ర పరిశీలకులు మురళి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త నరసయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం, జిల్లా కలెక్టరేట్ రిప్రజెంటేటివ్ చైర్మన్ చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మణి, జిల్లా కార్యదర్శి ఇళయరాజా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావణన్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీతో పాటు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తన శ్రేణులను సమాయత్తం చేసుకుంటూ, ప్రజల్లో పార్టీ విధానాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

# తిరుపతి జిల్లా అంగన్వాడి అధ్యక్షురాలుగా సిద్ధవటం శ్రీలక్ష్మి ఎన్నిక

**తిరుపతి, పెన్ పవర్,అక్టోబర్ 11:**

తిరుపతి జిల్లా అంగన్వాడి మహాసభలో ఈరోజు జిల్లా అధ్యక్షురాలుగా పుల్లంపేట కు చెందిన సిద్ధవటం శ్రీ లక్ష్మీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు.



# అన్నను గొంతు కోసి చంపిన తమ్ముడు



**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**

ఏపీ: కర్నూలు జిల్లా గడివేముల మండలం బిలకలగూడూరులో ఆదివారం అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, పోలీసులకు లొంగిపోవాలనే విషయమై అన్నదమ్ముల మధ్య జరిగిన తీవ్ర వాగ్వాదం చివరికి దారుణ హత్యకు దారితీసింది.

స్థానిక వివరాల ప్రకారం, ఒక కేసులో నిందితుడిగా కొనసాగుతున్న అన్న సుంకన్న (34)ను వెంటనే పోలీసులకు లొంగిపోవాల్సిందిగా తమ్ముడు గోలుసన్న కోరడం జరిగింది. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వివాదం చెలరేగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో ఊగిపోయిన తమ్ముడు కొడవలితో అన్న సుంకన్న గొంతు కోసి కిరాతకంగా హతమార్చాడు.

ఈ భయానక ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటన ఆ గ్రామంలో తీవ్ర కలకలం రేపింది.

## ఎన్నికల నేపథ్యంలో కార్డన్ సెర్చ్, రూట్ మార్చ్

**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**



బాపట్ల జిల్లా: చిన్నగంజాం మండలం సంతరావూరులో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్, రూట్ మార్చ్ నిర్వహించారు. ఇంకొల్లు సర్కిల్ సీఐ రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కారంచేడు ఎస్ఐ పులి గోపి, చిన్నగంజాం ఎస్ఐ జి. సురేష్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ తనిఖీల్లో భాగంగా రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లు, అలాగే పలు అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాబోయే ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా చూడటంతో పాటు, ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## విశాఖ హైవేపై రూ. 9 కోట్ల విదేశీ బంగారం పట్టివేత



**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**

ఏపీ: విశాఖపట్నం జాతీయ రహదారిపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి, కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న 5.83 కిలోల (24 క్యారెట్ల) విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 8.98 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఈ బంగారాన్ని కారు సీటు కింద రహస్య క్యావిటీలో దాచినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి, తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# సింగరేణిలో లాభాలను ప్రకటించాలి





**- కార్మికులకు 35 శాతం బోనస్ ఇవ్వాలి..**

**- కూనవరం గేటు వద్ద రాస్తారోకో, నిరసన..**

**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**

2025-26 ఆర్థిక సంవత్సరం లో సింగరేణి యాజమాన్యం లాభాలను ప్రకటించాలని, సింగరేణి కార్మికులకు 35% బోనస్ చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు మాచారపు లక్ష్మణరావు వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు ఆదివారం కూనవరం రైల్వే గేట్ వద్ద రాస్తారోకో నిరసన తెలియజేశారు సింగరేణి కార్మికుల హక్కులను కాపాడబడాలన్న, సింగరేణి కార్మికులకు ఆర్థికపరమైన అంశాలు నెరవేరాలన్నా, మెడికల్ ఇన్వాల్యుయేషన్, మారు పేర్లు, పెరెక్స్ ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్, సొంతింటి పథకము మరియు సంక్షేమ కార్యక్రమాలు కావాలన్నా, పని పరిస్థితులలో రక్షణ మరియు నూతన ఎక్విప్మెంట్, స్పేర్ పార్ట్స్ నూతన పనిముట్లు కావాలన్నా సింగరేణి సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. సింగరేణి కార్మికుల సంక్షేమ మరియు హక్కుల కొరకే కాకుండా సింగరేణి సంస్థను పరిరక్షించుకోవడం కొరకు గత కొద్ది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి వేల కోట్ల రూపాయల మొండి బకాయిలు ట్రాన్స్కో నుండి రావలసినటువంటి 27 వేల కోట్ల రూపాయలను మరియు జెన్కో నుండి రావాల్సినటువంటి 19 వేల కోట్ల రూపాయలను మొత్తం 46 వేల కోట్ల రూపాయలను సింగరేణి సంస్థకు వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ లోని విద్యుత్ సౌధా వద్ద చేపట్టినటువంటి భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిఐటియు నాయకులకు కార్యకర్తలకు కార్మికులకు పేరుపేరునా విప్లవావి వందనాలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కోల్ ఇండియా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు ముత్యాల సుమన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సాయి కృష్ణ , ముజాఫర్, బొల్లం రాజు, గుర్రం నరస య్య తదితరులు పాల్గొన్నారు

## డబల్ ఇంజన్ తోనే పరేషాన్, మరి త్రిబుల్ ఇంజన్ వస్తే పేదవాడి పరిస్థితి ఏమిటి? - డాక్టర్ షేక్ మహబూబ్ వలి

**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**



ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ఒక ప్రకటనలో మాట్లాడుతూ డబల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్రంలో, దేశంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు జీవనం గడపడం దుర్లభంగా మారింది.

ఇటువంటి పరిస్థితిలో త్రిబుల్ ఇంజన్ వస్తే పేదవాడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 2014 యూపీఏ హయాంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, డాలర్, బంగారం ధరలు ఎలా ఉండేవో, నేడు డబల్ ఇంజన్ పాలనలో ఎలా పెరిగాయో ప్రజలందరికీ తెలుసు.

పేదరికం, నిరుపేదరికం రోజురోజుకూ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను నేటి బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తోంది. పథకాలకు పేర్లు మార్చడం తప్ప వాటిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. డబల్ ఇంజన్ సర్కారులో పారిశ్రామికవేత్తలకు మంచి రోజులు వచ్చాయి తప్ప పేదవాడికి అచ్చే దిన్ ఎప్పుడు వస్తాయని నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పేద ప్రజల గురించి ఏ ఒక్క పార్టీ ఆలోచిస్తోందా? నిత్యవసర ధరలు రోజురోజుకీ పెరుగుతుంటే కూటమి ప్రభుత్వం గానీ, ప్రతిపక్ష వైసీపీ గానీ ప్రశ్నిస్తోందా? అని ప్రశ్నించారు.

కావునరానున్న స్థానిక ఎన్నికల్లోప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, ప్రజల హక్కులను కాపాడటానికి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : సీఎం చంద్రబాబు.








**- నెల్లూరులో పేదలకు పట్టాభిషేకం.**

**- నెల్లూరులో సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న అర్హులైన పేదలకు వర్చువల్‌గా పట్టాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**- 939 మంది లబ్ధిదారులకు 22.31 ఎకరాల భూమికి సంబంధించి పట్టాల పంపిణీ**

**- 60 ఏళ్ల నిరీక్షణకు తెర..**

**- పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీతో ప్రజల ఆనందానికి అవధులు లేవు : మంత్రి నారాయణ.**

**- మరో 4 వేల మంది నిరుపేదలకు త్వరలో పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల.**

**నెల్లూరు, అక్టోబర్ 11:, (పెన్ పవర్ జిల్లా బ్యూరో ):**

నెల్లూరు నగరంలోని సర్వేపల్లి కాలువ కట్టపై సుమారు ఆరు దశాబ్దాలుగా నివసిస్తూ శాశ్వత ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేసింది.

ఆదివారం సాయంత్రం అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా పట్టాలను లబ్ధిదారులకు అందజేసి అభినందనలు తెలిపారు. 939 మంది లబ్ధిదారులకు 22.31 ఎకరాల భూమికి సంబంధించి పట్టాలను పంపిణీ చేశారు.

నెల్లూరు నగరంలోని పూలేబొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్ల, నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ నందన్ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కులు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవంతో పాటు ఆస్తి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. నెల్లూరు నగరంలో వచ్చే సంక్రాంతి నాటికి మరో 4,000 పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందించే ప్రక్రియను ఉద్యమంలా చేపడుతున్నామని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, తాగునీటి కనెక్షన్లు, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేదరికం, ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని చెప్పారు.

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల గట్లపై మూడు తరాలుగా నివసిస్తున్న కుటుంబాలతో పట్టాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎంకు వివరించారు. గతంలో ఇచ్చిన పత్రాలు తమకు పూర్తి స్థాయి హక్కులు కల్పించలేదని, బ్యాంకు రుణాలు పొందడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని బాధితులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో చర్చించి, అర్హులను గుర్తించి కేబినెట్ ఆమోదంతో శాశ్వత పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అలాగే నేడు సర్వేపల్లి కాలువకట్టలపై నివసిస్తున్న ప్రజలు గత 60 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇంటి పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని మంత్రి నారాయణ తెలిపారు. అర్హులైన 1,215 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సర్వేపల్లి కాలువకట్టలపై నివసిస్తున్న ప్రజలు ఇళ్ల పట్టాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ, తమకు శాశ్వత పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారని మంత్రి తెలిపారు. వారి సమస్యను పరిష్కరించేందుకు తాను రెండుసార్లు అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసినట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయపరిచి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని, కేబినెట్‌లో ప్రతిపాదనకు ఆమోదం పొందిన అనంతరం 1,215 మందికి శాశ్వత ఇంటి పట్టాల పంపిణీకి మార్గం సుగమమైందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయని మంత్రి అన్నారు. గత ఏడాది భగత్ సింగ్ కాలనీలో 1,407 మందికి శాశ్వత ఇంటి పట్టాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా జాఫర్ సాహెబ్ కాలువకట్ట, జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన వారికి కూడా త్వరలో ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నెల్లూరు నగరంలో మరో 4 వేల మందికి ఇంటి పట్టాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, సర్వేపల్లి కాలువ కట్టపై సుమారు 60 సంవత్సరాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తున్నట్లు తెలిపారు. భూ అక్రమాలు, ద్వంద్వ రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బ్లాక్‌చైన్ విధానాన్ని వినియోగించి పట్టాల పంపిణీ ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. నెల్లూరు నగరంలోని భగత్ సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు 2,600 కుటుంబాలకు పట్టాలు అందించినట్లు ముఖ్యమంత్రికి వివరించారు. జాఫర్ సాహెబ్ కాలువ, సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతాల్లో మరో 4,000 మంది నిరుపేదలకు పట్టాలు అందించాల్సి ఉందని, నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం పలువురు లబ్ధిదారులు ముఖ్యమంత్రితో వర్చువల్‌గా మాట్లాడి, తమకు శాశ్వత ఇంటి పట్టాలు అందడంపై సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి పొంగూరు నారాయణ చొరవతో తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను కూడా ముఖ్యమంత్రితో పంచుకున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రి పొంగూరు నారాయణ దంపతులు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు పసుపు, కుంకుమ, చీరతో పాటు ఇంటి పట్టాలను అందజేశారు. దశాబ్దాల నిరీక్షణ అనంతరం ఇంటి పట్టాలు అందడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వింజమూరులో ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు..!

**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**



వింజమూరు పట్టణంలోని వి.ఆర్. కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసి, వారి బాధ్యతాయుతమైన సామాజిక సేవా ప్రయాణానికి శుభాకాంక్షలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ గారు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో ఆర్యవైశ్య సంఘం కీలక పాత్ర పోషిస్తోందని, వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవ, విద్య, వైద్య సహాయం, పేదలకు అండగా నిలవడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ సభ్యులు సంఘ ఐక్యతను కాపాడుతూ, సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

సంఘ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు సంపాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం ద్వారా నూతన కార్యవర్గం మరింత ఉత్సాహంతో, బాధ్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ గారు ఆకాంక్షిస్తూ మరోసారి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## శ్రీకాళహస్తిలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు
## తొలిరోజు నాగ బాలాంబికాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ కరిమారియమ్మ దేవి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11:**

శరన్నవరాత్రి ఉత్సవాల శుభ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని బహుదూరుపేట రాతిపనివారివీధిలో వెలసి ఉన్న శ్రీశ్రీ కరిమారియమ్మ దేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారిని నాగ బాలాంబికాదేవి అలంకరణలో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి అలంకరణను దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారి కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ, సంప్రదాయ భక్తిభావాన్ని చాటిచెబుతున్నాయి.

ఈ సందర్భంగా అమ్మవారి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. రాబోయే రోజుల్లోనూ అమ్మవారికి వివిధ అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్తబృందం తెలిపింది.





## ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఘనంగా దుర్గాదేవి పూజలు...

**పెన్ పవర్అక్టోబర్ 11 స్టేట్ బ్యూరో**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో శరన్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో దుర్గాదేవి అమ్మవారికి ఘనంగా పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి కృపతో ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగి సకాలంలో స్వస్థత చేకూరి ఆరోగ్యంగా వెళ్లాలని అమ్మవారిని కోరారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి గర్భవతి సురక్షిత ప్రసవం పొంది తల్లి బిడ్డలు సుఖంగా ఇంటికి చేరాలని అమ్మవారిని ప్రత్యేకంగా కోరారు. అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్న శ్రీనుకు చిన్న పదవినా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయనను అంతా చిన్న శ్రీను అని పిలుస్తారు కానీ రాజకీయంగా చూస్తే పెద్ద శ్రీను కిందనే లెక్క. దశాబ్దాల పాటు కాంగ్రెస్ వైసీపీలో పనిచేసి సీనియర్ నేతలలో ఒకరిగా ఉన్న మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీనుకు విజయనగరం జిల్లా వ్యాప్తంగా రాజకీయంగా పట్టు ఉంది. ఆయన వ్యూహాలను ఎవరూ తేలికగా తీసుకోలేరు. అలాంటి చిన్న శ్రీను వైసీపీకి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు బ్యాక్ బోన్ గా ఉండేవారు. ఆయన గత నెలలో అనూహ్యంగా ఫ్యాన్ నీడ నుంచి బయటపడి సైకిలెక్కేశారు. ఆనాడు ఆయన గురించి చాలా చర్చనే సాగింది. చిన్న శ్రీనుకు టీడీపీలో భారీ ఆఫర్ ఉందని కూడా చెప్పుకున్నారు. ఆయనే కాబోయే మంత్రి అని కూడా ప్రచారం చేసేశారు.

**కట్ చేస్తే మరి :**

ఎమ్మెల్సీగా ముందు చాన్స్ ఇచ్చి ఆనక మంత్రిగా చేస్తారు అన్నది పుకార్లుగానూ షికారు చేశాయి. నిజానికి చిన్న శ్రీనుకు ఆ పదవులను చేపట్టే అనుభవం సామర్థ్యం ఉందని కూడా చెప్పాలి. ఆయన జిల్లా పరిషత్ చైర్మన్ గా అయిదేళ్ళు పనిచేశారు. విజయనగరం జిల్లా వైసీపీలో ముఖ్య పాత్ర పోషించి అనేక మంది ఎమ్మెల్యేల విజయం వెనక ఉన్నారు. కాబట్టి మంత్రిగా ఆయనకు అవకాశం ఇచ్చినా అర్హుడే అని అనుకున్నారు కానీ కట్ చేస్తే ఆయనకు చిన్న పదవి దక్కింది అన్న అసంతృప్తి అయితే ఆయన అనుచరులలో ఉంది అరకు పార్లమెంట్ నియోజకవరం అబ్జర్వర్ గా చిన్న శ్రీనుని పార్టీ నియమించింది. నిజానికి ఇది చిన్న శ్రీను స్థాయికి చిన్న పదవి అని ఆయన అభిమానులు మధనపడుతున్నారని అంటున్నారు.

**వైసీపీతో పోల్చుకుంటూ :**

ఇక చిన్న శ్రీను వైసీపీని వీడేటపుడు అక్షరాలా అయిదు పదవులలో ఉన్నారని లిస్ట్ చదువుతున్నారు. ఆయన వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా పరిషత్ చైర్మన్ గా, భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇంచార్జిగా, రాష్ట్ర వైసీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్రా నాయకుడిగా వ్యవహరించేవారు అని గుర్తు చేస్తున్నారు. అలాంటి ఆయన టీడీపీలో చేరితే ఉత్తరాంధ్రా కన్వీనర్ పోస్టు ఇస్తారని లేదా విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి కట్టబెడతారు అని అనుచరులు భావించారని అంటున్నారు. ఎన్నో ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయని వాటిలో ఒకటి ఆయనకు ఇచ్చి ఆ మీదట మంత్రిని కూడా చేయవచ్చు అని ఊహించారని అంటున్నారు. మరి వైసీపీలో అన్ని పదవులు వదులుకుని వచ్చిన చిన్న శ్రీనుకు తగిన హోదా దక్కలేదని అనుచరులు మధన పడుతున్నారని టాక్ నడుస్తోంది.

**వెయిట్ చేస్తేనే :**

అయితే ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంప్ చేశాక ఎంతటి సీనియర్ నేత అయినా అక్కడ కొత్త వారి కిందనే లెక్క అని అంటున్నారు. పైగా వలస వచ్చిన నేతలను అంతవరకూ ఉన్న వారు కూడా వేరేగానే చూస్తారు. దాంతో అందరితో కలిసి పోవాల్సి ఉంటుంది. అలాగే పార్టీని మరింతగా పటిష్టం చేయడం ద్వారా అధినాయకత్వంతో పాటు స్థానిక నేతల మన్ననలు అందుకుంటే ఆటోమేటిక్ గా పదవులు దక్కుతాయని అంటున్నారు. వేచి ఉండకపోతే ఎక్కడైనా పదవులు రావనే చెబుతున్నారు. అయితే చిన్న శ్రీను మనసులో ఏముందో ఆయన బయటపడడం లేదు, పైగా అనుభవం కలిగిన నేత కాబట్టి వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారు. ఆయనకు నేరుగా టీడీపీ అధినాయకత్వంతోనే కలిసి మాట్లాడే అవకాశం ఉంది కాబట్టి ఆయనకు టీడీపీలో మంచి అవకాశాలే దక్కుతాయని అంటున్న వారూ ఉన్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# జనసేన త్యాగానికి తగిన ప్రాతినిధ్యం దక్కాలి : డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికల సమయంలో జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళల త్యాగాలను గుర్తు చేస్తూ డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన కార్యకర్తల త్యాగాలను గుర్తించాలని కోరారు. అడవితల్లిబాట 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు ఆదివారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, వేములకొండ పంచాయతీ పరిధిలోని రాకోట గిరిశిఖర గ్రామంలో పవన్ పర్యటించారు. అనంతరం అదే పంచాయతీ పరిధిలోని కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపేలా రూ. 2.29 కోట్ల వ్యయంతో 3.4 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన చేశారు. రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఉన్న రచ్చబండ వద్ద గిరిపుత్రులతో 'మాటా-మంతి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అదేసమయంలో స్థానిక ఎన్నికల విషయంలో డిప్యూటీ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ నెల 15 నుంచి స్థానిక ఎన్నికల సమరం ప్రారంభం అవుతుందనగా డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. 2014 ఎన్నికల్లో కూటమి కోసం తాను పనిచేశానని, ఆ సమయంలో ఒక్క కౌన్సిలర్, ఎంపీటీసీ పదవిని కూడా తాము అడగలేదని పవన్ గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో జనసైనికులు, వీర మహిళలు ధైర్యంతో రోడ్డుపైకి వచ్చి పోరాడారని అన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుని పదవుల్లో తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. నా దేశం బాగుండాలి, నా నేల బాగుండాలని తాను కోరుకుంటానని చెప్పారు. జనసైనికులు కూడా తన మాదిరిగానే పనిచేస్తున్నారని కొనియాడారు. కూటమి నాయకులు అందరికీ మద్దతు ఇచ్చినట్లుగానే జనసేన నాయకులను స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించాలని, స్థానిక ఎన్నికల్లో గ్రామాల భవిష్యత్తు కోసం ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అడవితల్లి బాట అంటే కేవలం రహదారుల నిర్మాణం ఒక్కటే కాదని, గిరిజనుల జీవితాలను సమూలంగా మార్చే కార్యక్రమమని వ్యాఖ్యానించారు.

ఇక అడవి బిడ్డల కష్టాలు తెలుసుకునేందుకు అరణ్యం మధ్యలోని గిరిశిఖర గ్రామానికి పవన్ వెళ్లారు. సుమారు 350 మంది జనాభా కలిగిన రాకోట గ్రామాన్ని సందర్శించి, గిరిజనుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చింత చెట్టు

కింద కూర్చుని వారితో మమేకమయ్యారు. గిరిజనులు ప్రస్తావించిన సమస్యలపై తక్షణమే స్పందించి, పరిష్కారాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. శిథిలావస్థలో ఉన్న రాకోట పాఠశాల పునరుద్ధరణకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. హనుమాన్ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఆలయ పరిస్థితిని గమనించిన ఆయన, దేవాదాయ శాఖ సహకారంతో భజన మందిరంగా అభివృద్ధి చేసేందుకు మరో రూ. 20 లక్షలు కేటాయించాలని అధికారులకు సూచించారు.

**సమస్యలకు తక్షణ పరిష్కారాలు**

'మాటా-మంతి' కార్యక్రమంలో రాకోట పరిసర ప్రాంతాలైన వేములకొండ, సువర్లవాడ, డబ్బావలస, తిరుగటిరాళ్లు, కాకవాడ, చిలకవీధి, వెట్టిచెలకలు, సోకులగూడెం తదితర గ్రామాల ప్రజలు

తమ సమస్యలను పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఆయన తక్షణమే స్పందించారు. ప్రతి గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రంతో కూడిన మండల పరిషత్ పాఠశాల, విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ అభివృద్ధి పనుల కోసం వివిధ పథకాల ద్వారా దాదాపు రూ. 5 కోట్లు కేటాయించారు. గిరిజనులు తమ సమస్యలను స్వయంగా ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేయడంతో గిరిపుత్రుల్లో భరోసా నింపారు.

# యోగీ వర్సెస్ అఖిలేష్ ... అయోధ్యలో తేల్చుకుందామా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అయోధ్య అనగానే భక్తి భావన కలుగుతుంది. శ్రీరాముడి జన్మస్థలంగా దానికి పేరు. రాముడు అక్కడ వెలసిన చోటు అని అంతా ఆధ్యాత్మిక కోణంలో ఆలోచిస్తారు. అలాంటి అయోధ్యలో ఇపుడు రాజకీయ వేడి రాజేస్తున్నారు. ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఇద్దరూ ఢీ అంటే ఢీ అంటున్నారు. అయోధ్యలో తేల్చుకుందామా అని ఒకరు అంటే సై అని మరొకరు అంటున్నారు. దీంతో 2027 లో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇద్దరూ అయోధ్య వేదికగా ముఖా ముఖీ తలపడేందుకు సిద్ధపడుతున్నారు.

అయోధ్యలో బలమెంత :

ఇదిలా ఉంటే అయోధ్యలో బలం బీజేపీకే ఉంది. వరుసగా రెండు సార్లు ఆ పార్టీ అక్కడ నుంచి గెలిచింది. 2017, 2022 లలో బీజేపీకి చెందిన వేద్ ప్రకాష్ గుప్తా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇంకా చెప్పాలీ అంటే అయోధ్యలో గత యాభై ఏళ్లలో బీజేపీ అత్యధిక సార్లు గెలిస్తే మిగిలిన పార్టీలు అన్నీ ఒకటి రెండు సార్లు మాత్రమే విజయం అందుకున్నాయి. గడచిన ముప్పయి అయిదేళ్ళలో చూస్తే ఒక్కసారి మాత్రమే సమాజ్ వాది పార్టీ గెలిస్తే మిగిలిన అన్ని సార్లూ బీజేపీ అయోధ్యలో గెలిచింది. అందుకే సీఎం యోగి ఆదిత్యనాథ్ అయోధ్య నుంచి తాను పోటీకి రెడీ అని అంటున్నారు.

**సవాల్ చేసిన అఖిలేష్ :**

ఇంతకీ యోగి అయోధ్య నుంచి పోటీకి ఎందుకు సిద్ధపడ్డారు అంటే మాజీ సీఎం సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సవాల్ కి జవాబుగా అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో దమ్ముంటే అయోధ్య నుంచి పోటీ చేయాలని అఖిలేష్ సీఎం యోగికి సవాల్ విసిరారు. దానికి కారణం ఉంది. అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ లో అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. దాని విషయంలో అయితే విపక్షాలకు ఒక ఆయుధం దొరికింది. ఈ నేపథ్యంలోనే అఖిలేష్ యోగికి సవాల్ చేశారు. అక్కడ పోటీకి దిగితే బీజేపీ సంగతి జనాలు చూస్తారు అన్నదే ఎస్పీ ఆలోచనగా ఉంది.

**మళ్ళీ బీజేపీదే :**

దానికి యోగి ఒక్క ముక్కలో జవాబు చెప్పలేదు, తాను అయోధ్యలో పోటీకి దిగుతాను అని అంటూనే మరోసారి యూపీలో బీజేపీ గెలుస్తుందని కూడా ధీమా వ్యక్తం చేశారు. నూటికి ఎనభై సీట్లు బీజేపీకే వస్తాయని అన్నారు. సమాజ్ వాదీ పార్టీని ఒక కుటుంబ పార్టీగా ఆయన అభివర్ణించారు. రాజ్యసభ ఎన్నికల్లో తన సొంత బాబాయ్ కి సీటు ఇచ్చిన ఘనత ఎస్పీది అని యోగీ సెటైర్లు వేశారు. బడుగులు దళితులు ఇతర వర్గాలకు టికెట్లు ఇవ్వాలని ఎస్పీకి అనిపించలేదా అని ప్రశ్నించారు. ఎస్పీ ఏర్పాటు చేసిన కూటమి యూపీని ముంచేదిగా ఉందని కూడా యోగీ మండిపడ్డారు.

**గెలుపు ధీమాతోనే :**

అయితే రెండు సార్లు బీజేపీకి చాన్స్ ఇచ్చిన యూపీ జనాలు ఈసారి మార్పు కోరు కుంటున్నారని సమాజ్ వాదీ పార్టీ అభిప్రాయ పడుతోంది. అందుకే అయోధ్య నుంచి యోగీ పోటీ చేసినా తాను కాదు ఒక యువ నేతను ముందు పెట్టి ఓడించగలమని అంటున్నారు. ఈసారి గెలిచేది ఎస్పీనే అని అఖిలేష్ నిబ్బరంగా ఉంటూ యోగీకి సవాల్ విసిరారు. దానికి ప్రతిగా యోగీ కూడా మీకు దక్కేది ఇరవై శాతం సీట్లే అని కౌంటర్ ఎటాక్ చేశారు. మొత్తానికి దేశ రాజకీయ గతిని మార్చేసే సత్తా ఉన్న యూపీలో ఆరు నెలల ముందే ఎన్నికల వేడి రాజుకుంది. అది కూడా రాముడి జన్మస్థలం వేదికగా సవాళ్ల పర్వానికి శ్రీకారం చుట్టింది. ఇంతకీ యోగీ అఖిలేష్ ప్రత్యక్షంగా పోటీకి దిగుతారా అంటే అది అయ్యేది కాదనే అంటున్నారు.

# అంబానీ రేంజ్ చూసి మైండ్ బ్లాక్ అయిందో ఏమో.. భారత్‌లో కాలు పెట్టకముందే మస్క్ మాట మార్చేశాడు




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతరిక్షంలో వేల ఉపగ్రహాలు వదిలినా.. ఇండియాలో ముకేశ్ అంబానీ నెట్‌వర్క్ దాటి రూపాయి కూడా అదనంగా పిండలేరు" అనే నిజాన్ని ఎట్టకేలకు ఎలన్ మస్క్ గ్రహించినట్లున్నారు. అమెరికాలోలాగా అడిగినంత ఛార్జీలు గుంజేద్దాం అని ఆశపడ్డ స్టార్‌లింక్ బాస్.. భారత టెలికాం మార్కెట్లోకి కాలు పెట్టకముందే ప్లేట్ ఫిరాయించేశారు.మన దేశంలో కూరగాయల కంటే చౌకగా లభించే మొబైల్ డేటాను, ఆఫర్ల వర్షం కురిపించే 'అంబానీ ఇంటర్నెట్ ఆర్మీ'ని చూసి లైట్‌గా మైండ్ బ్లాక్ అయిన మస్క్.. "అయ్యో భారత్‌లో మా సేవలు అందరికీ అందుబాటు ధరల్లోనే ఉంటాయండి" అంటూ దిగొచ్చి చిలకపలుకులు పలుకుతున్నారు. అంతరిక్ష సాంకేతికతతో రాకెట్ స్పీడులో ఇంటర్నెట్ ఇస్తామన్నా ఇక్కడ 'తక్కువ ధర'కే మొదటి ప్రాధాన్యం అనే విషయం బోధపడటంతో.. శాటిలైట్ సేవలకు సైతం స్పెషల్ ఇండియన్ డిస్కౌంట్ వర్తింపజేయక తప్పని పరిస్థితి నెలకొంది.భారత టెలికాం మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్న ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్.. ధరల విషయంలో కీలక సంకేతాలు ఇచ్చింది. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటు ధరల్లోనే ఉంటాయని మస్క్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే తక్కువ ధరలకు డేటా సేవలు అందిస్తున్న భారత టెలికాం కంపెనీల మధ్య స్టార్‌లింక్ ఎలా నిలదొక్కుకుంటుందన్న ప్రశ్నకు ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ధరల విషయంలో వెనక్కి తగ్గినట్టేనా?**

స్టార్‌లింక్ ఇంటర్నెట్ ధరలు ఎక్కువగా ఉంటే భారతీయ వినియోగదారులు వాటిని కొనుగోలు చేయరని మస్క్ అభిప్రాయపడ్డారు. అందుకే సేవలను ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు అందించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే ధరలు ఎంత ఉంటాయి? నెలవారీ చార్జీలు, పరికరాల ఖర్చు ఎంత మేరకు తగ్గుతాయి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.భారత్‌లో ఇంటర్నెట్ మార్కెట్ ఇతర దేశాలతో పోలిస్తే భిన్నమైనది. ఇక్కడ మొబైల్ డేటా తక్కువ ధరలకే లభిస్తోంది. ఇప్పటికే కోట్లాది మంది వినియోగదారులు సరసమైన ధరలకు 4+, 5+ సేవలను ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టార్‌లింక్ అధిక ధరలతో మార్కెట్‌లోకి వస్తే సాధారణ వినియోగదారులను ఆకర్షించడం సవాలుగా మారుతుంది.

**అంబానీతో పోటీ.. మస్క్‌కు అసలైన పరీక్ష**

రిలయన్స్ జియో అధినేత ముకేశ్ అంబానీ ఇప్పటికే భారత టెలికాం రంగంలో బలమైన స్థానాన్ని సంపాదించారు. తక్కువ ధరల డేటా ప్లాన్లు, విస్తృత నెట్‌వర్క్, భారీ వినియోగదారుల సంఖ్య జియోకు ప్రధాన బలాలు. మరోవైపు స్టార్‌లింక్ ఉపగ్రహాల ఆధారంగా ఇంటర్నెట్ సేవలు అందిస్తుంది. ముఖ్యంగా భూభాగంపై సంప్రదాయ నెట్‌వర్క్ ఏర్పాటు కష్టమైన మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ అందించడంలో ఈ సాంకేతికత ఉపయోగపడే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో జియోతో స్టార్‌లింక్ పోటీని కేవలం ధరల కోణంలోనే చూడలేం. ఒకవైపు తక్కువ ఖర్చుతో మొబైల్ డేటా, ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు ఉంటే.. మరోవైపు శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ అందించే ప్రత్యామ్నాయం ఉంది. ఈ రెండు సేవల వినియోగదారుల అవసరాలు అన్ని సందర్భాల్లో ఒకేలా ఉండవు.

**'అంబానీ ఇంటర్నెట్ ఆర్మీ'పై మస్క్ వ్యాఖ్యలు**

స్టార్‌లింక్ ధరలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చకు స్పందిస్తూ 'అంబానీ ఇంటర్నెట్ ఆర్మీ' వాదనలు హాస్యాస్పదంగా ఉన్నాయని మస్క్ వ్యాఖ్యానించారు.. అంబానీ అందించే తక్కువ ధరలతో స్టార్‌లింక్ పోటీ పడలేదని చెబుతూనే మరోవైపు అది పోటీదారుగా మారుతుందని వాదిస్తున్నారు. పోటీ పెరిగితే వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని.. అంబానీ లాభాలు తగ్గినా వ్యాపారం మూతపడిపోదని మస్క్ అభిప్రాయపడ్డారు.

**భారత్‌లో స్టార్‌లింక్‌కు అవకాశాలెంత?**

భారత్‌లో స్టార్‌లింక్ విజయాన్ని నిర్ణయించే అంశాలు ధరలకే పరిమితం కావు. సేవల లభ్యత, ఇంటర్నెట్ వేగం, వాతావరణ పరిస్థితుల్లో పనితీరు, పరికరాల కొనుగోలు ఖర్చు, నెలవారీ చార్జీలు, ప్రభుత్వ అనుమతులు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, సంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు సరిగా అందుబాటులో లేని ప్రాంతాల్లో స్టార్‌లింక్‌కు అవకాశాలు ఉండవచ్చు. అయితే నగరాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న చౌకైన ఫైబర్ కనెక్షన్లతో పోటీ పడాలంటే ధరల విషయంలో మరింత ఆకర్షణీయమైన ప్రతిపాదనలు అవసరం కావచ్చు.

**చివరికి లాభపడేది వినియోగదారుడేనా?**

స్టార్‌లింక్ భారత్‌లో సరసమైన ధరలకు సేవలు అందించగలిగితే శాటిలైట్ ఇంటర్నెట్‌కు కొత్త వినియోగదారులు వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో పోటీ పెరగడం వల్ల ఇతర సంస్థలు కూడా తమ సేవలను మెరుగుపరచడం లేదా కొత్త ధరల ప్రణాళికలను ప్రవేశపెట్టడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. అయితే పోటీ కారణంగా ధరలు తప్పనిసరిగా తగ్గుతాయని ఇప్పుడే నిర్ధారించలేం. మొత్తానికి భారత్‌లో స్టార్‌లింక్ భవిష్యత్తును నిర్ణయించేది మస్క్ వ్యాఖ్యలు మాత్రమే కాదు.. వినియోగదారులకు అందించే తుది ధరలు, సేవల నాణ్యత, స్థానిక మార్కెట్‌కు అనుగుణంగా రూపొందించే వ్యూహం. భారత టెలికాం రంగంలో ఇప్పటికే నెలకొన్న ధరల పోటీని దృష్టిలో పెట్టుకుంటే స్టార్‌లింక్‌కు సరసమైన ధరలే కీలక సవాలుగా మారనున్నాయి.

# సీజేపీ ధర్నాతో ఢిల్లీకి డబుల్ దెబ్బ.. రూ.2,000 కోట్ల వ్యాపార నష్టం.. నేతలకు మేజిస్ట్రేట్ షరతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు నిరసనకారులు 'శాంతియుతంగా' రోడ్డెక్కితే పండగ షాపింగ్ పక్కనబెట్టి వ్యాపారులు ఏకంగా రూ.2,000 కోట్ల 'సమర్పణ' చెప్పుకోవాల్సి వచ్చింది. ఒకవైపు వ్యాపారుల జేబులు ఖాళీ అవుతుంటే మరోవైపు ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదంటూ మేజిస్ట్రేట్ షరతుల కాగితం చేతిలో పెట్టడంతో సీజేపీ నేతలు ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో భావి కార్యాచరణ కోసం స్క్రిప్ట్ వెతుక్కుంటున్నారు.దేశ రాజధాని ఢిల్లీలో సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) చేపడుతున్న ఆందోళనలు రాజకీయంగానే కాకుండా తీవ్ర ఆర్థిక చర్చకు దారితీస్తున్నాయి. ఒకవైపు నిరసనల కారణంగా స్థానిక వ్యాపారాలు అతలాకుతలమవుతున్నాయనే నివేదికలు వస్తుంటే మరోవైపు నిరసనల్లో అరెస్టయిన నేతలకు మేజిస్ట్రేట్ తీవ్ర షరతులతో కూడిన విడుదల ఉత్తర్వులు జారీ చేశారు.పండగల సీజన్ కావడంతో ఢిల్లీలోని ప్రధాన రిటైల్ మార్కెట్లు, కొనుగోళ్లు కళకళలాడాల్సిన సమయంలో సీజేపీ ఆందోళనలు పెను సవాలుగా మారాయి. భద్రతా కారణాల రీత్యా పోలీసులు విధించిన రాకపోకల ఆంక్షల వల్ల సాధారణ ప్రజలు, వినియోగదారులు మార్కెట్లకు రావడం గగనంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం శనివారం నాటి ధర్నాలు, ఆంక్షల కారణంగా సుమారు రూ.2,000 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిలిచిపోయినట్లు వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ నష్టం అంచనాపై ఇంకా స్వతంత్ర ధ్రువీకరణ వివరాలు వెలువడాల్సి ఉంది.మరోవైపు నిన్న విమానాశ్రయంలో విమానంలో ఉండగానే సీజేపీ కీలక నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. కాగా ఢిల్లీ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వారి విడుదలకు ఆదేశాలు జారీ చేస్తూనే ఒక కఠినమైన షరతు విధించారు. అరెస్టయిన సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ రాబోయే ఏడాది కాలం పాటు ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు సృష్టించకూడదని.. అల్లర్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ షరతులు ఉల్లంఘిస్తే తీవ్ర న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుండటంతో ఉద్యమాన్ని హింసాత్మకం కాకుండా ఎలా తీసుకెళ్లాలనే దానిపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.సీజేపీ నేడు కూడా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని ప్రకటించడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అసంబద్ధ సంఘటనలు జరగకుండా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా సీజేపీ నాయకత్వం మధ్యాహ్నం 2 గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో మేజిస్ట్రేట్ విధించిన షరతులు, నాయకుల అరెస్టులు, తదుపరి ఉద్యమ కార్యాచరణపై తమ అధికారిక వైఖరిని స్పష్టం చేయనున్నారు.ప్రస్తుతం సీజేపీ ముందు రెండు ప్రధాన సవాళ్లు ఉన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మేజిస్ట్రేట్ షరతులు దాటకుండా ప్రజాస్వామ్యయుతంగా నిరసనను ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది మొదటిదైతే.. వరుస ట్రాఫిక్ ఆంక్షలతో విసిగిపోతున్న సామాన్య ప్రజలకు, నష్టపోతున్న వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ఏ విధమైన వ్యూహాన్ని అనుసరించాలనేది రెండోది. మధ్యాహ్నం జరగబోయే మీడియా సమావేశంతో ఈ ఆందోళనలు ఏ మలుపు తిరుగుతాయో స్పష్టత రానుంది.

# అభిషేక్ శర్మ విధ్వంసం.. టీమిండియా భారీ స్కోరు

**వెస్టిండీస్‌తో మూడో టీ20లో భారత్ భారీ స్కోరు**

**20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైన టీమిండియా**

**కేవలం 30 బంతుల్లో 69 పరుగులు చేసిన అభిషేక్ శర్మ**

**మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ**

**విండీస్ బౌలర్లలో ఛేజ్, జోసెఫ్, స్ప్రింగర్‌కు రెండేసి వికెట్లు**



వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా, నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడగా.. ఇషాన్ కిషన్ (37; 18 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో వెస్టిండీస్ ముందు 224 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్, భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే సంజూ శాంసన్ (3) వికెట్‌ను కోల్పోయినా, మరో ఓపెనర్ అభిషేక్ శర్మ, వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కేవలం 40 బంతుల్లోనే 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 87 పరుగులు చేసింది.

అయితే, భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌కు విండీస్ బౌలర్లు షాకిచ్చారు. ఇషాన్ కిషన్‌ను రోస్టన్ ఛేజ్ ఔట్ చేయగా, అదే ఓవర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఆ కొద్దిసేపటికే, మరింత ప్రమాదకరంగా మారుతున్న అభిషేక్ శర్మ కూడా ఔట్ కావడంతో భారత్ 124 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. దాంతో, టీమిండియా స్కోరు 220 పరుగులు దాటింది. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్, షమార్ జోసెఫ్, షమార్ స్ప్రింగర్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, కీమో పాల్, గుడాకేశ్ మోతీకి చెరో వికెట్ దక్కింది. అయితే, విండీస్ బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

# టెస్టుల్లో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్

**టెస్ట్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించిన బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్**

**ఈ ఘనత సాధించిన తొలి బంగ్లా ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు**

**అబుదాబిలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న టెస్టులో ఈ అరుదైన ఫీట్**

**మొత్తం 5 వికెట్లు పడగొట్టి.. అత్యంత వేగంగా 50 వికెట్లు పూర్తి**



బంగ్లాదేశ్ యువ ఫాస్ట్ బౌలర్ హసన్ మహమూద్ టెస్ట్ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌గా, దేశం తరపున మూడో బౌలర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లా జట్టు తరపున టెస్టుల్లో ఇప్పటివరకు ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే హ్యాట్రిక్ సాధించగా, ఓ పేసర్ ఈ ఫీట్ అందుకోవడం ఇదే తొలిసారి.అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజైన ఆదివారం ఈ అద్భుతం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌట్ కాగా, బదులుగా బ్యాటింగ్ చేస్తున్న ఆఫ్ఘనిస్థాన్ 220/5 స్కోరుతో నిలిచిన దశలో 26 ఏళ్ల హసన్ మహమూద్ విజృంభించాడు. ఇన్నింగ్స్ 83వ ఓవర్‌లో వరుస బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను పెవిలియన్‌కు పంపాడు. తొలుత ఇస్మత్ ఆలమ్‌ను (1) క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే ఖైస్ అహ్మద్‌ను వికెట్ కీపర్ లిట్టన్ దాస్ అద్భుతమైన క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఇక మూడో బంతికి జియా-ఉర్-రెహ్మాన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. హసన్ మహమూద్ కంటే ముందు బంగ్లాదేశ్ తరఫున లెగ్ స్పిన్నర్ అలోక్ కపాలి (2003లో పాకిస్థాన్‌పై), ఆఫ్ స్పిన్నర్ సోహగ్ గాజీ (2013లో న్యూజిలాండ్‌పై) మాత్రమే టెస్టుల్లో హ్యాట్రిక్ సాధించారు. ఈ మ్యాచ్‌లో హసన్ మరో ఘనత కూడా అందుకున్నాడు. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి వికెట్‌ను పడగొట్టి ఐదు వికెట్ల హాల్‌ను పూర్తి చేశాడు. దీంతో టెస్టుల్లో 50 వికెట్ల మైలురాయిని కూడా చేరుకున్నాడు. బంగ్లాదేశ్ తరఫున అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పేసర్‌గా నిలిచాడు. హసన్ మహమూద్ దెబ్బకు ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్‌కు 106 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేళ.. స్మృతి మంధానకు ప్రత్యేక గౌరవం



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది.ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది.యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించడానికి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం" అని వివరించారు.ఇటీవలే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధాన జట్టు పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2025లో తొలిసారిగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఆమె కీలక సభ్యురాలు. అదే ఏడాది, ఒక క్యాలెండర్ ఇయర్‌లో 1,000 వన్డే పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది.

2026 నాటికి మహిళల అంతర్జాతీయ క్రికెట్, టీ20 ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ప్రస్తుతం మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి, అర్జున అవార్డు గ్రహీత, అలాగే రెండుసార్లు 'ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా గెలుచుకుంది.



అమృత అయ్యర్ అద్భుతమైన పచ్చ ఆకుపచ్చ దుస్తులలో సొగసైనదిగా కనిపిస్తుంది

# మమితా బైజు టాలీవుడ్ లో మరో ఛాన్స్!



-ప్రేముల-తో యువత హృదయాలను కొల్లగొట్టిన అందాల భామ మమితా బైజు సౌత్ ఇండియన్ చిత్రసీమలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోతుంది. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో, సహజమైన నటనతో అభిమానులను సంపాదిం చుకున్న యంగ్ సెన్సేషన్ టాలీవుడ్‌లో దూకుడు పెంచారు. ఇప్పటికే టాలీవుడ్‌లో విశ్వనాథ్ అండ్ సన్స్ లో నటించిన అమ్మడు తాజాగా మరో భారీ అవకాశం అందుకుందని ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది.ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (గాఎజఖ) నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం -జై హనుమాన్- లో మమితా బైజు కీలక పాత్రలో ఎంపికైందనే వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొని ఉండగా ఇందులో రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో మమిత భాగమైతే.. అమ్మడి కెరీర్‌కు ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ కావడం ఖాయం.

**అయితే టాలీవుడ్‌లో మమితా బైజు హడావుడి ఇక్కడితో ఆగిపోలేదు.**

తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ య్యేందుకు సొగసరి వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నారు. కొత్త ప్రాజెక్ట్ లకు సంబంధించి జోరుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. తన పీఆర్ టీమ్ ఇక్కడా చురుకుగా పని చేస్తుందని తెలిసింది. మరోవైపు మేనేజర్లు నిర్విరామంగా కొత్త అవకాశాల వేటలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.ఒకవైపు మలయాళ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ టాప్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది మమిత. -ప్రేముల- సక్సెస్ ఇచ్చిన జోరును కంటిన్యూ చేస్తూ తెలుగులోనూ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సౌత్ ఇండస్ట్రీలో ప్రత్యేకమైన మార్కెట్‌ను క్రియేట్ చేసుకుంటోంది.మమితా బైజు కమిట్ అవుతోన్న చిత్రాల ప్రచార సరళిని చూస్తే? రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మలయాళ భామ హవా మరింత జోరుగా సాగడం ఖాయమనిపిస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ పాత్రలతో పాటు, స్టార్ హీరోల సరసన పాన్-ఇండియా స్థాయి ప్రాజెక్ట్‌లను దక్కించుకుంటూ దూసుకెళ్తున్న తీరు యువ నటీమణులకు స్ఫూర్తిగా నిలుస్తుంది.



బోల్డ్ లెదర్ అథ్లీజర్ స్ట్రీట్‌వేర్ లుక్‌లో నోరా ఫతేహి మెరుపులు

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965